www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం

24-07-2024

సంపుటి : 01 | సంచిక : 81 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ

CMD





## వికసిత్ భారత్ లక్ష్యంగా

# బడ్జెట్లో కేటాయింపులు

- నిరుద్యోగులు, రైతులు, గ్రామీణ అభివృద్ధికి బడ్జెట్లో పెద్దపీట
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**విశ్వంభర, హైద్రాబాద్ :** వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్లో కేటాయింపులు జరిగాయని, ప్రధానంగా నిరుద్యోగులు, రైతులు, గ్రామీణాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్లో తగిన నిధుల కేటాయింపులు చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా 9 ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుందని, వ్యవసాయ రంగంలో ఉత్పాదక, ఉద్యోగ కల్పన నైపుణ్య అభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన ఆవిష్కరణలు, తయారీ - సేవలు లాంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుందన్నారు. ముఖ్యంగా యువత కోసం ఐదు పథకాలతో పీఎం ప్యాకేజీ తీసుకువచ్చిందని, ఈ బడ్జెట్లో యువతపై కేంద్ర ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెట్టిందన్నారు. విద్యా ఉపాధి కల్పన నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిందని, దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను ఇందుకోసం కేటాయించిందన్నారు. ఉపాధిరంగం ఏదైనా తొలి వేతనం కింద రూపాయలు 15,000 నగదు బదిలీ జరిగే విధంగా చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు ఆర్థి కంగా తోడ్పాటును అందించడానికి, ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం రూపాయలు 10 లక్షల వరకు ఎడ్యుకేషన్ లోన్ ఇవ్వడం, ముద్రలోన్ పరిమితి రూపాయలు 20 లక్షల పెంపు చేయడం హర్షణీయమన్నారు. అలాగే వ్యవసాయానికి అనుబంధ రంగాల కోసం రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించారని, వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు ప్రకృతి సేద్యాన్ని చేసేలా చర్యలు చేపట్టడం, గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయించడం శుభ పరిణామన్నారు. మహిళలకు, బాలికలకు లబ్ధి చేర్చే పథకాల కోసం మూడు లక్షల కోట్లు, గృహ నిర్మాణా నికి రూ. 2.2 లక్షల కోట్లు, మౌలిక సదుపాయాల కోసం రు. 11.11 లక్షల కోట్లు, కోటి గృహాలు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందు కు ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన, 100 నగరాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్ పై స్టాంప్ డ్యూటీల తగ్గింపు, ఐదేళ్లలో కోటిమంది యువతకు ప్రయోజనం చేకూర్చే ఇంటర్న్ షిప్ పథకం, ప్రధానమంత్రి అన్నా యోజన మరో ఐదేళ్ల పొడిగింపు లాంటి అనేక అంశాలకు ప్రాధాన్యతని ఇచ్చారని ఆయన తెలిపారు.



# శ్రీకాకుళంలో బ్యాడ్మింటన్ పోటీలు

### సత్తా చాటిన సాన్వీ లట్టాల

**విశ్వంభర, హైదరాబాద్ :** శ్రీకాకుళంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్11 గర్ల్స్ సింగిల్స్ విభాగంలో సాన్వీ లట్టాల అద్భుతమైన ఆటతీరు కనబరిచింది. ఫైనల్ లో గెలిచి స్టేట్ టోర్నమెంట్ కు అర్హత సాధించింది. సెమీ ఫైనల్ మ్యాచ్ లో నదియాపై 30/16 పాయింట్లతో గెలుపొంది ఫైనల్ చేరుకుంది. ఫైనల్స్ లో తన ప్రత్యర్థి జయశ్రీపై 30/05 తో గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించింది. అండర్ 13 గర్ల్స్ డబుల్స్ విభాగంలో సాన్వి లట్టాల, జ్యోస్న డబుల్స్ జోడి గోల్డ్ మెడల్ గెలుచుకున్నారు. ఫైనల్ లో హిమశ్రీ, మోక్షశ్రీ జోడిపై అద్భుతమైన ఆటతో 30/27 స్కోర్ తో పోరాడి గెలుపొందారు. ఈ సందర్భంగా విజేతలకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్, సాంబమూర్తి, జిల్లా సీఈఓ సూరిబాబు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేశారు. అండర్ 11, అండర్ 13 స్టేట్ టోర్నమెంట్ కి అర్హత సాధించిన సాన్వి లట్టాలని మణికొండ మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్, చైర్మన్ వేణు మప్పాల అభినందించారు. అంతర్జాతీయ క్రీడాకారులు, మ్యాచ్ పాయింట్ కోచ్ లు విద్యాధర్, లింగేశ్వర్ సాన్విని ప్రశంసించారు. ఇంకా ఎన్నో టోర్నమెంట్లలో గెలిచి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని సూచించారు. సాన్విని ప్రోత్సాహిస్తున్న శ్లోకా స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులను కూడా అభినందించారు.

## రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను

# యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి డిండి ప్రాజెక్టును సందర్శించి మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 2015 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలైన నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు త్రాగునీరు, సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభమైందని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు వెనక భాగం నుంచి సంవత్సరంలో 60 రోజుల పాటు లిఫ్టుల ద్వారా నీటిని రిజర్వాయర్లను ఏర్పాటుచేసి రోజుకు 2 టీఎంసీ నీళ్లు అందులో 1 1/2 టీఎంసీ నీళ్లు రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలకు 1/2 టీఎంసీ నీళ్లు నల్లగొండ జిల్లాకు మొత్తం 30 టీఎంసీల నీళ్లను అందించాలని ఐదు రిజర్వాయర్ల ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 3 లక్షల 40 వేల ఎకరాల వ్యవసాయ భూములను సాగులోకి తేవాలని, వందలాది గ్రామాలకు త్రాగునీరు అందించాలని పథకం ప్రారంభమైంది అని ఆయన పథకం ప్రారంభమైన 8 సంవత్సరాల నుంచి రెండు రిజర్వాయర్లను పూర్తి చేయడం, మిగతా మూడు రిజర్వాయర్ల పనులు నత్త నడకన సాగుతున్నాయని ఆయన తెలిపారు. డీపీఆర్ అప్రోల్, పర్యావరణ, అటవీశాఖ అనుమతులు లేకుండా, బడ్జెట్ కేటాయించకుండా, తోక భాగం నుండి రిజర్వాయర్ల పనులు మొదలుపెట్టి, రైతుల నుంచి భూసేకరణ పూర్తికాకుండానే పనులు ప్రారంభిం చినట్లు తెలిపారు. రిజర్వాయర్ల పనులు నత్త నడకన సాగుతున్నాయని, కాలువల పనులు పూర్తికాలేదని ఆయన తెలిపారు. 5 రిజర్వాయర్లను సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగిందని, నల్లగొండ జిల్లాకు కృష్ణ, గోదావరి జలాలు హక్కు ప్రకారం అందితే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలలో రిజర్వాయర్లకు నిధులు కేటాయించి, పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆయన కోరారు. ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పనులను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారి ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు నల్ల వెంకటయ్య, కంబాలపల్లి ఆనంద్, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఆదరణ పొందే సందేశాత్మక చిత్రాలు తీయాలి

### - జగిని రమేష్



**విశ్వంభర, హైద్రాబాద్ :** సినిమాపై ఉన్న ఆసక్తితో నేటి యువత సినీ రంగంలో అడుగులు వేస్తూ మంచి చిత్రాలును అందించడంతో పాటు సమాజాన్నీ చైతన్యపరిచే సందేశాత్మక చిత్రాలు తీయాలని నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జగిని రమేష్ అన్నారు. హైద్రాబాద్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నల్గొండకు చెందిన నటీనటులు నటించి నిర్మిస్తున్న నటన అనే షార్ట్ ఫిల్మ్ ట్రైలర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అనునిత్యం జరుగుతున్న సంఘటనలను ఇతివృత్తంగా తీసుకొని ప్రజలను ఆలోచింపజేసే విధంగా ఇలాంటి మంచి చిత్రాలు తీయడం అభినందనీయమని పేర్కొన్నారు. మునుముందు ప్రజా ఆదరణ పొందే చిత్రాలు తీయాలని అలాంటి వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆగష్టు 11న రిలీజ్ అయ్యే ఈ షార్ట్ మూవీని ప్రేక్షకులు ఆదరించాలని దర్శక నిర్మాతలు కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకులు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, నిర్మాత శేఖర్ శివకోటి, నటులు నాగ సూర్య, చిక్కుళ్ళ యాదగిరి, పూజిత శ్రీనివాస్, వెంకన్న యాదవ్, మిర్యాల శివ, అడవి రాముడు, గోవింద్ రెడ్డి, ప్రణయ్, సునీల్, కొండల్, దుర్గ, రామ్ తలపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.






V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
24-07-2024
సంపుటి : 01 | సంచిక : 81 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

మూడో విడత మోదీ సర్కార్ లక్ష్యాలను వివరిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించారు. వరుసగా ఏడోసారి వార్షిక పద్దును ప్రవేశపెట్టిన ఆమె వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా అన్ని రంగాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ మేరకు రూ. 48.21 లక్షల కోట్ల అంచనాలతో వార్షిక పద్దును ప్రవేశపెట్టారు. ఈ వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులు 31.3లక్షల కోట్లుగా పేర్కొన్న ఆర్థిక మంత్రి, మూలధన రాబడులను రూ.16.9 లక్షల కోట్లుగా వివరించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.37.1 లక్షల కోట్లుగా వివరించిన మంత్రి మూలధన వ్యయం రూ.15లక్షల కోట్లు అని పేర్కొన్నారు. రెవెన్యూ లోటు జీడీపీలో 4.9 శాతంగా ఉంటుందని వివరించారు. బడ్జెట్‌లో అత్యధికంగా రక్షణ రంగానికి రూ.4,54,773 కోట్లు ప్రతిపాదించారు.



# వికసిత్ భారతే లక్ష్యం

**ధరలు తగ్గనున్న వస్తువులు..**
- క్యాన్సర్ ఔషధాలు
- మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, విడిభాగాలు
- తోలుతో తయారు చేసిన వస్తువులు
- సముద్రపు ఆహారాలు (సీ ఫుడ్)

**ధరలు పెరగనున్న వస్తువులు..**
- ప్లాస్టిక్ ఉత్పత్తులు
- టెలికాం పరికరాల ధరలు

## తొమ్మిది ప్రాధాన్యాలతో కేంద్రబడ్జెట్‌లో కేటాయింపులు

### 48.21 లక్షల కోట్ల అంచనాలతో వార్షిక పద్దు ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**విశ్వంభర, హైదరాబాద్ :**
తొమ్మిది ప్రాధాన్య అంశాల ఆధారంగా ఈ కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన ఆవిష్కరణలు, తయారీసేవలు, తర్వాత తరం సంస్కరణలు అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ ప్రాధాన్యాలను నెరవేర్చే దిశలో స్పష్టమైన మార్పులు కనిపించేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని అన్నారు. గత ప్రకటనలను బలోపేతం చేయడం సహా సమర్థంగా అమలు చేసేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయి. వికసిత్ భారత్ లక్ష్యాన్ని వేగంగా చేరుకునే ప్రయాణంలో భాగంగా ఈ చర్యలు ఉంటాయి.

**ఉత్పాదకతకు పెద్దపీట**
వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను భారీగా పెంచేందుకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు నిర్మలా సీతారామన్. వచ్చే ఐదేళ్లలో సుమారు నాలుగు కోట్ల ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించిన మంత్రి సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసేందుకు పలు చర్యలను ప్రతిపాదించారు. పట్టణాభివృద్ధి, ఇంధన భద్రతకూ పెద్దఎత్తున నిధులు కేటాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల మిగతా5లో...

# ఇది కుర్చీ బచావో బడ్జెట్



దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోంది. ఇలాగే కొనసాగితే మరో ఉద్యమం తప్పదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర హక్కులను మోదీ వద్ద తాకట్టు పెట్టారు. కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో ఆయన చెప్పాలి. రాష్ట్ర హక్కుల కోసం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలుపుతారు.
**-తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**

మోదీని పెద్దన్న పాత్ర పోషించాలని అడిగితే తెలంగాణకు అన్యాయం

బడ్జెట్‌లో అన్యాయానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిదే బాధ్యత

కేసీఆర్ సభకు వచ్చి బడ్జెట్‌పై నిలదీయాలన్న ముఖ్యమంత్రి

**విశ్వంభర, హైదరాబాద్:**
కేంద్ర బడ్జెట్‌టలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటును అవమానించిన ప్రధాని మోదీ మొదటి నుంచి రాష్ట్రంపై కక్ష చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర మంత్రులతో కలిసి ఇప్పటికే 18 సార్లు కేంద్రాన్ని కలిసి విజ్ఞప్తి చేసినా, రాష్ట్రానికి అన్యాయమే చేశారని విమర్శించారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేది బోగస్ నినాదంగా మార్చారని ధ్వజమెత్తారు. ఇది వికసిత్ భారత్ బడ్జెట్ కాదు, కుర్చీ బచావో బడ్జెట్ అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్‌లో బిహార్, ఏపీకి తప్ప ఇతర రాష్ట్రాల అభివృద్ధికి నిధులివ్వలేదని సీఎం విమర్శించారు. విభజన చట్టం కేవలం ఏపీకే కాదు తెలంగాణకూ వర్తిస్తుందని వెల్లడించారు. బీజేపీకి ఓట్లు, సీట్లు మాత్రమే కావాలి తప్ప, రాష్ట్రానికి చేసేదేం లేదని మండిపడ్డారు. వికసిత భారత్‌లో తెలంగాణ భాగం కాదని ప్రధాని అనుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగతా5లో...

# ఏపీకి డబుల్ బొనాంజ

- ఏపీ మళ్లీ గాడిలో పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య
- కేంద్రానికి కృతజ్ఞతలు



5

# కేంద్ర బడ్జెట్ బాధాకరం

- తెలంగాణకు మరోసారి గుండు సున్నా
- ప్రాంతీయ పార్టీలకే అధిక నిధులు
- కాంగ్రెస్, బీజేపీకి 16 సీట్లు ఇస్తే ఇచ్చిందేమీ లేదన్న మాజీ మంత్రి కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించామని, కానీ దక్కింది శూన్యమన్నారు. ఇంత పెద్ద బడ్జెట్‌లో కేవలం కొన్ని రాష్ట్రాలకే పెద్దపీట వేశారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మరొకసారి దక్కింది గుండుసున్నానే అన్నారు. పునర్విభజన చట్టంలో దాదాపు 35 హామీలపై నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మిగతా5లో...

# తెలంగాణ అనే పదమే ఉచ్చరించలేదు

- కాంగ్రెస్ బీజేపీ లు కలిసి రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయి
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదు
- కిషన్ రెడ్డి ,బండి సంజయ్ ఏం చేస్తున్నారు ?
- కేంద్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



5



5

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

బీజేపీ రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసింది: ఉత్తమ్

# 8 మంది ఎంపీలను గెలిపిస్తే ఇదా రిటర్న్ గిఫ్ట్?

- మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ తెలంగాణకు బడ్జెట్లో అన్యాయమే
- టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ విమర్శ



**విశ్వంభర, హైదరాబాద్:** సమైక్య రాష్ట్రంలో అభివృద్ధిలో అన్యాయం, వివక్షలను సహించలేకనే తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకుని.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, మోడీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో అదే వివక్ష కొనసాగిస్తున్నారని టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ మిగతా5లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

# నీట్ రీ ఎగ్జామ్ ఉండదు

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు




**విశ్వంభర, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. సిస్టమిక్ పేపర్ లీకేజీని నిరూపించేందుకు తగిన సాక్ష్యాలు లేవు కాబట్టి.. మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన మిగతా5లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 112 | ₹ 134 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 194 | ₹ 221 |



# సరదాకు వెళ్తే తీరని విషాదం

- బోగత జలపాతంలో యువకుడి మృతి
- జలపాతం వద్ద స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తుండగా ఘటన
- సూచనలు తప్పక పాటించాలి అంటున్న అధికారులు

5

# రాజకీయ కక్షతోనే నా కుమార్తెను జైల్లో పెట్టారు

## బిడ్డ జైల్లో ఉంటే తండ్రిగా నాకు బాధ ఉండదా?

- నేను అగ్నిపర్వతంలా ఉన్నా
- తమ పార్టీకి ఎలాంటి క్లిష్టపరిస్థితులు లేవని వ్యాఖ్య
- ఇంతకంటే ఇబ్బందికర పరిస్థితుల్లోనే తెలంగాణ సాధించుకున్నామన్న కేసీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:**
రాజకీయ కక్షతోనే తన కుమార్తె కవితను జైల్లో పెట్టారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సొంత కుమార్తె జైల్లో ఉంటే కన్నతండ్రిగా బాధ ఉండదా? అని ఆయన ప్రశ్నించారు. అయినా తాను అగ్నిపర్వతంలా ఉన్నట్లు పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ ఎస్‌శాసనసభా పక్ష సమావేశం అనంతరం ఆయన పలు మిగతా5లో...



# విశ్వ నరుడు గుర్రం జాషువా



## నేడు... కవి కోకిల వర్ధంతి

"ఒక అంటరాని వాడు, పవిత్రమైన హిందూ గ్రంథాలు ,కావ్యాలు చదువుతున్నాడని ఇటు హిందూ ఛాందసుల కన్నెర్రకు...క్రైస్తవుడై వుండి హిందూ నాటకాలు రాసి హిందూ మత ప్రచారానికి తోడ్పడు తున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురయ్యాడు జాషువా. ఒక వంక దారిద్ర్యం, మరోవంక కుల మత వివక్ష. బాల్యం నుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవ హేళనల్ని, ఛీత్కారాలను ఎదుర్కొన్నాడు. చిన్నతనం నుంచే తిరగబడే తత్వంతో వీటన్నింటినీ అధిగమించిన జాషువా, విద్యార్థి దశనుంచే వ్యంగ్య చిత్రాలు గీయడం, గొల్లసుద్దులు, లలిత కళల పట్ల ఆసక్తి పెంచు కొన్నాడు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరి కొందరు జాషువాను కులం పేరుతో తీవ్రంగా అవమానించారు. జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కులం తెలుసుకొని అవమానించినా, ఆవేదనకు లోనైనా, నిరుత్సాహ పడక, "కళకు కుల మతాలున్నాయా?" అని ప్రశ్నిస్తూ, ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు. "విశ్వనరుడ నేను" అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటాడు.

పుట్టుకతో దళితుడైనా, పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవిచక్రవర్తై, తమ కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువా. ఆయన సమకాలీన కవిత్వ ఒరవడియైన భావ కవిత్వపు రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు. జాషువా 1895, సెప్టెంబరు 28 న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాత్రగడ్డపాడులో జన్మించాడు. తండ్రి యాదవులు, తల్లి మాదిగ. మూఢాచారాలతో నిండిన నాటి సమాజంలో అవమానాలకు లోనయ్యాడు. అయినా జాషువా ఊరుకొనే వాడు కాదు, తిరగ బడేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడి వాళ్ళను కొట్టాడు. 1910లో మేరీని పెళ్ళి చేసు కున్నాడు. అయినా ఆయన కుటుంబాన్ని క్రైస్తవ సమాజం నుండి బహిష్కరించారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు. తర్వాత రాజమండ్రి వెళ్ళి 191516 లలో అక్కడ సినిమా వాచకుడిగా పని చేసాడు. టాకీ సినిమాలు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు అనుగుణంగా నేపథ్యంలో కథను, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. తరువాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేశాడు. తరువాత 1928 నుండి 1942 వరకు గుంటూరు లోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పని చేశాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేశాడు. 195759 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా ఉన్నాడు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బాల్య స్నేహితుడూ, తరువాతి కాలంలో రచయితా అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది.

"కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టు వడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన
నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను'. అయితే

కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు. జాషువా, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. అగ్రవర్ణ దురహంకారాలను చవి చూసిన జాషువా సౌమ్య పదజాలం తోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్లు "నాకు గురువులు ఇద్దరు...పేదరికం, కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది. "ఆయన కవిగా, వ్యక్తిగా విరాట్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. ఆయన

క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు జరిగాడు. బాల్య స్నేహితుడు, తరువాతి కాలంలో రచయిత అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం, కుమార సంభవం, రఘు వంశం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు వ్రాశాడు. వాటిలో ప్రముఖమైనవి...క్రీస్తుచరిత్ర , గబ్బిలం, పిరదౌసి, రుక్మిణీ కళ్యాణం, శ్మశాన వాటిక, వివేకానంద, జేబున్నీసా, నాగార్జున సాగరం, కాందిశీకుడు. 'నా కథ' పేరుతో ఆత్మకథను కూడా రాసుకున్నారు. ఆయన మనో భావాన్ని దళిత యువకుడి ద్వారా చక్కగా చెప్పాడు."వాని నుద్ధరించు భగవంతుడే లేడు, మనుజుడెట్లు వాని గనికరించు, వాడు జేసికొన్న పాపకారణ మేమో యింత వరకు వాని కెరుకలేదు.""ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు, గసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు". ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రతి పద్యాన్ని ఉదహరించవచ్చు."సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అనే ఈ పద్యంలో కవిలోకానికి జాషువా సముచిత స్థానం కల్పించాడు. తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, జాషువా కాలికి గండ పెండేరం తొడిగి "ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను" అన్నాడు. అది తనకు లభించిన "అత్యున్నత పురస్కారం"గా జాషువా భావించాడు. 1964లో క్రీస్తు చరిత్రకు "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు" లభించగా, ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా నియమితుడయ్యాడు.

1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయము కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. భారత ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారం అందజేసింది.

జాషువా ఒక మధుర కవి అని, ఒకానొక మాధుర్యం ఆయన కవిత్వంలో శారదాదేవి అనుగ్రహం చేత లభించిందని విశ్వనాథ సత్యనారాయణ అన్నారు. "ఆయన వ్రాసిన శిశువు (పాపాయి) అనే ఖండికను ఘంటసాల అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంలో ఈ పాట రికార్డింగ్ జరిగే సమయంలో జాషువా, ఘంటసాల యింటికి వెళ్ళి, బయట అరుగు మీద కూర్చున్నారట. ఘంటసాల, బయటకు వచ్చి, "ఏమిటండీ! బయటనే కూర్చున్నారు" అని అడిగితే, "నేను అంటరాని కులానికి చెందిన వాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా లోపలికి ఎలా రాగలను?" అన్నారట జాషువా. అందుకు, ఘంటసాల "నాకు అటువంటి పట్టింపులు లేవు, మీరు స్వేచ్ఛగా లోపలి రావచ్చు. పైగా మీరు సరస్వతీ పుత్రులు. మీరు అంటరాని వారైతే, సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్థం!" అని చెప్పి ఇంట్లోకి సాదరంగా తీసుకొని వెళ్లి, తన సహృదయాన్ని చాటుకొన్నారు.

కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ గా ప్రసిద్ధు డయ్యాడు. "వడగాల్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం" అని జాషువా అన్నది అక్షర సత్యం.

"రాజు మరణించె నొక తార రాలిపోయె, సుకవి మరణించె నొక తార గగనమెక్కె, రాజు జీవించు రాతి విగ్రహముల యందు, సుకవి జీవించు ప్రజల నాల్కల యందు". " సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గఱగిపోయె ! యిచ్చోట; నే భూము లేలు రాజన్యుని యధికార ముద్రిక లంతరించె! యిచ్చోట; నే లేఁత యిల్లాలి నల్లపూసల సౌరు, గంగలో గలిసిపోయె! యిచ్చోట; నెట్టి పేరెన్నికం గనుఁగొన్న చిత్ర లేఖకుని కుంచియ, నశించె! ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబు; ఇది మరణ దూత తీక్షణమౌ దృష్టు లొలయ నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు". స్మశాన వాటిక లోని ప్రతి పద్యం మన గుండెలను పిండుతుంది. చివరికి జూలై 24, 1971న గుర్రం జాషువా లోకం వదిలి వెళ్ళారు. కానీ ఆయన మరణవార్త బయటి ప్రపంచానికి చెప్పని ఇంటి వాతావరణం. అంతిమ యాత్ర అయిన వారు వెంట లేకుండా సాగింది. సమాజం ఆయనను చిన్న చూపు చూసింది, దూరంగా పెట్టిందని మదనపడిన జాషువా చివరి దశలో కుటుంబ సభ్యులు ఆయనను దూరం చేశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

## నేడు వారి వర్ధంతి



"నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః,
స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం''

ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమాచరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం.

కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరీ తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని చెప్పక తప్పదు. కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యంలో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు.

అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజినీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 182829 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు.

కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు.

అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది.

1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పదివేలమంది కూలీలతో పాటుగా అయిదు వందల మంది వడ్రంగులు, అయిదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మరమయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహుదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. తర్వాత 1852 గన్నవరం అక్విడక్టు పనులు కూడా కాటన్ ప్రారంభించారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటు లోకి వచ్చింది.

ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు.

20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెనువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామి కాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దే. ఆయన బెంగాల్, ఒడిశా, బిహార్, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు,బెంగాలీలు, ఒరియాలు, బిహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమపాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్. ఆ అపర భగీరథునికి, ప్రాతః స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకోగలరు?

# తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం కే.వి.రంగారెడ్డి

## నేడు ఆయన వర్ధంతి



తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం ఆయన. తెలంగాణ కోసం నెహ్రూతో సైతం ఢీకొనడానికి వెనుకాడనని ప్రాంతీయ అభిమాని. పదవీ త్యాగానికి వెన్ను చూపని త్యాగశీలి. చేయాలనుకున్నది ఎన్ని అడ్డంకులెదురైనా చేసిన ధీశాలి. నిజాం వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు కూడా వెళ్ళిన పోరాట యోధుడు.1950లోనే ఆయన తెలంగాణ వాదం వినిపించారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బూర్గులను నిలిపి గెలిపించింది కూడా ఆయనే. ఆయనే కొండా వెంకట రంగారెడ్డి. ఆంధ్ర ప్రదేశ్ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ప్రముఖ న్యాయవాదిగా, పలు సంస్థల వ్యవస్థాపక బాధ్యునిగా బహుముఖ సేవలు అందించిన నేతగా ఆయన చరిత్రలో నిలిచి పోయారు.

కొండా వెంకట రంగారెడ్డి (డిసెంబరు 12, 1890 జూలై 24, 1970) స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తొలితరం రాజకీయ నాయకులు. ఆయన పేరు మీదుగానే రంగారెడ్డి జిల్లాకు ఆ పేరు వచ్చింది1959 నుంచి 1962 వరకు దామోదరం సంజీవయ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. , నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో కూడా మంత్రి పదవి నిర్వహించారు. ఆయన నైజాం శాసనసభలో, హైదరాబాదు రాష్ట్ర శాసనసభలోనూ, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.

1936లో ఆయన శాసనసభకు ఎన్నిక కావడంతో ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగింది. సభలో 24 శాసనాలను, కొన్ని సవరణలు ప్రవేశపెట్టారు. అందులో స్త్రీలకు వారసత్వపు హక్కు కలిగ జేయడం, వర్ణాంతర వివాహం చేసుకుంటే వారి సంతానం సక్రమ సంతానమని నిరూపణ, బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, జాగీర్ల రద్దు, ఉద్యోగాల నియామకానికి పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాటును తన రెండేళ్ల పదవి కాలంలో చేయగలిగారు. కేవీ రంగారెడ్డి పూర్తి పేరు కొండా వెంకట రంగారెడ్డి. ఆయన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తాలుకాలోని పెద్ద మంగళారంలో 1890 డిసెంబరు 12న కొండా చెన్నారెడ్డి, బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించారు. కేవీ రంగారెడ్డి మనస్సు ఎప్పుడూ అనాదరణకు గురైన స్త్రీల దుర్గతిపైన, దళితుల, పేదల ఆర్థిక దుస్థితిపైన ఉండేది. దీన్ని ఎలాగైనా రూపు మాపాలని అనుకునేవారు. స్త్రీ తన భర్త చనిపోగానే ఎలాంటి ఆస్తి లేకుండా నిరాదరణకు గురయ్యేది. అలాగే నిమ్న జాతుల వారు కూడా నిరాదరణకు గురయ్యేవారు. జాగీరుదారులకు, పేద రైతులక మధ్య వివాదాలు వచ్చినపుడు పేదల పక్షాన నిలిచేవారు. పేదల పక్షాన ఉచితంగా వాదించేవారు. రంగారెడ్డి ఆంధ్ర మహాసభ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మహబూబ్ నగర్ జిల్లా షాద్‌నగర్లో జరిగిన అయిదో ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాద్‌లో అనేక సాంఘిక, సాంస్కృతిక సేవాసంస్థల ఆవిర్భావంలో ప్రధాన పాత్ర పోషించారు. 1940 వరకు జిల్లా కోర్టు, హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1943లో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. అంతేకాదు సాహిత్యాభివృద్ధి కోసం1943లో ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం, శ్రీవేమన భాషా నిలయం స్థాపనకు తోడ్పడ్డారు. హింధీ ప్రచార సభకు, గోలకొండ పత్రికకు, రయ్యత్ పత్రికకు చేయూత నందించారు. నిజాం సంస్థానం భారత్‌లో విలీనం అయిన తర్వాత బూర్గుల మంత్రి వర్గంలో రెవెన్యూ, ఎక్సైజ్, కస్టమ్స్ తదితర శాఖలను నిర్వహించారు.

నాటి ముఖ్యమంత్రి బూర్గులను ఏ కారణం లేకుండానే ముఖ్య మంత్రిగా రాజీనామా చేయాలని కోరినపుడు ఆ నిర్ణయాన్ని కేవీ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతే కాకుండా మేం మళ్లీ బూర్గులనే సీఎంగా ఎన్నుకుంటే మీరేం చేస్తారని నిలదీసిన ధీరుడు. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత కూడా నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో హోం శాఖ, రెవెన్యూ శాఖలను నిర్వహించారు. 1960లో నీలం సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెళ్లగా ఇక్కడ ముఖ్యమంత్రి పదవి దామోదరం సంజీవయ్యను వరించింది. ఆయన కాలంలో రంగారెడ్డి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి ఆయన మేనల్లుడు. ఏనాడూ ఏ విషయంలోనూ రాజీపడని మనస్తత్వం కొండాది. సంస్థానంలో మహారాష్ట్రులకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను పెట్టినా, తెలంగాణ ప్రాంతం నుంచే ముఖ్యమంత్రిని ఎంపిక చేయించినా, విశాలాంధ్రకు వ్యతిరేకత వ్యక్తం చేసినా అన్ని అదరక బెదరక చేసేవారు. చాలా వరకు పేదలకు ఉచితంగా పనులు చేసి పెట్టేవారు. విద్యార్థి దశలో తాను ఎదుర్కొన్న కష్టాలను పేద విద్యార్థులెవరూ ఎదుర్కొన కూడదనే ఉద్దేశంతో రెడ్డి హాస్టల్ కట్టించారు. బాలుర పాఠశాల, ఆంధ్రసరస్వతి, బాలికల పాఠశాల, రెడ్డి బాలికల హాస్టల్, ఆంధ్ర విద్యాలయం మొదలైన వాటిని కట్టించారు. 1970, జూలై 24 న రంగారెడ్డి మరణించారు. ఆయన స్మృత్యర్థం 1978, ఆగస్టు 15న హైదరాబాదు జిల్లాను విభజించి నూతనంగా ఏర్పడిన జిల్లాకు రంగారెడ్డి జిల్లా అని పేరుపెట్టారు.

# ఏపీకి డబుల్ బొనాంజ

**విశ్వంభర, ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా కేటాయింపులు చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలే కాకుండా.. ఇతర ప్రయోజనాలను కూడా ఏపీకి కల్పించారు.

**ఏపీకి ఇతర ప్రయోజనాలు..**

విదేశీ సంస్థల సాయంతో అమలయ్యే పలు ప్రాజెక్టులు కింద ఏపీకి నిధులు అందించనున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీ కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ ద్వారా వివిధ ప్రాజెక్టుల కింద ఏపీకి సాయం అందించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మండల్ కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అండ్ లైవ్లీహుడ్ ఇంప్రూమెంట్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్స్, ఆంధ్రప్రదేశ్ రోడ్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్, ఏపీ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చరల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్ట్‌లకు విదేశీ సంస్థల నుంచి సాయం అందనుంది.

**భారీగా పెరిగిన పన్నుల వాటా..**

ఇదిలాఉంటే.. కేంద్ర పన్నుల వాటా నుంచి రాష్ట్రానికి వచ్చే వాటాలోనూ భారీగా పెరుగుదల ఉంది. 202425 సంవత్సరానికి సంబంధించి కేంద్రం పన్నుల్లో ఏపీ పన్నుల వాటా రూ. 50,474 కోట్లు రానుంది. ఇదే సమయంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కి రూ. 620 కోట్లు కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. సింగరేణి సంస్థకు రూ. 1,600 కోట్లు కేటాయించింది. ఇక కీలకమైన పథకాల కింద ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని నిధులు అందనున్నాయి.

**బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న అంశాలివే..**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగంలో ఏపీకి కేటాయింపుల వివరాలను కూడా తెలిపారు. పోలవరం ప్రాజెక్టును వీలైనంత త్వరగా నిర్మించడం, రాష్ట్ర రాజధాని అమరావతికి ఈ ఏడాది రూ. 15 వేల కోట్ల కేటాయించడంతో పాటు.. ఈ సాయాన్ని ప్రతి ఏటా కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. విశాఖచెన్నైఓర్వకల్లుబెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు నిధులు కేటాయిస్తామన్నారు. పూర్వోదయ పథకం కింద ఏపీకి మరింత సాయం అందిస్తామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటునందిస్తామని ప్రకటించారు.

**2047కు ప్రపంచంలోనే భారత్ మొదటి లేదా రెండో స్థానానికి వస్తుంది**

ఆర్థిక ఇబ్బందుల వల్ల బడ్జెట్ కూడా పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రెండు నెలలు సమయం తీసుకుని బడ్జెట్ పెట్టాలనే ఆలోచనకు వచ్చామన్నారు. పీవీ తెచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి పెనుమార్పులకు నాంది పలికిందని, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో బ్రహ్మాండంగా అభివృద్ధి సాధ్యమైందన్నారు. వికసిత్ భారత్ 2047కు ప్రపంచంలోనే భారత్ మొదటి లేదా రెండో స్థానానికి వస్తుందన్నారు. ఆనాడు ఐటీకి ప్రాధాన్యమిచ్చామని, ఇవాళ తెలుగు వాళ్లు ప్రపంచంలో ఎక్కడికెళ్లినా కనిపించే పరిస్థితి ఉందన్నారు. జూన్ 4న వెలువడిన ఫలితాలు ప్రజా చైతన్యానికి నిదర్శనంగా నిలిచాయన్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్.. 57 శాతం కూటమికి ఓట్లు పడ్డాయననారు. తన రాజకీయ జీవితంలో ఏ రాజకీయ పార్టీకి ఇలాంటి ఫలితాలు చూడలేదన్నారు. ఈ స్థాయి విజయానికి చాలా కృషి ఉందన్నారు. గత ఐదేళ్లు చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. జైలుకు వచ్చి పవన్ కల్యాణ్ తనను పరామర్శించారని, క్లిష్ట సమయంలో ఓటు చీలకూడదనే ఒకే ఒక ఉద్దేశంతో పవన్ ముందుకొచ్చారన్నారు.



**ఏపీ మళ్లీ గాడిన పడుతుంది**

ఏపీ ఆర్థిక పరిస్థితిని, అవసరాలను గుర్తించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రికి ధన్యవాదాలు తెలిపారు సీఎం చంద్రబాబు. ఏపీ రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించారన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహకారం ఏపీ పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రానికి విశ్వాసాన్ని పెంచే బడ్జెట్ సమర్పించినందుకు కేంద్రాన్ని అభినందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ మళ్లీ గాడిలో పడుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో వ్యవస్థలన్నీ విధ్వంసం చేశారని, అహంకారంతో విర్రవీగి అసమర్థతతో వ్యవస్థలు నాశనం చేశారన్నారు. జగన్ పాలనలో మంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయంపై బడ్జెట్ లో పెట్టారని, మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయని ఆశ వచ్చిందన్నారు. ఏపీ జీవనాడి పోలవరం 72 శాతం పూర్తైతే, కావాలని కాంట్రాక్టర్లు, అధికారులను మార్చారన్నారు. పోలవరాన్ని వీలైనంత త్వరలో పూర్తిచేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు.

## సరదాకు వెళ్తే తీరని విషాదం

**విశ్వంభర, ములుగు :** రాష్ట్రంలో గత నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతూ, ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవి ప్రాంతంలోనూ కురిసిన భారీ వర్షాలకు పెనుగోలు అడవి ప్రాంతం నుంచి కొండ కోనల్లో వాగులు వంకలు పొంగిపొర్లడంతో ములుగు జిల్లాలోని వాజేడు మండలం చీకుపల్లి వద్ద బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. దీంతో జలపాతాన్ని వీక్షించేందుకు పర్యాటకులు సైతం పెద్దఎత్తున వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బొగత జలపాతం అందాలు చూడటానికి స్నేహితులతో వచ్చిన ఓ యువకుడు ఈతకు వెళ్లి మృతి చెందాడు. వరంగల్‌లో ఎనుమాముల మార్కెట్ సుందరయ్య నగర్‌కు చెందిన బొనగాని జస్వంత్(18) ఏడుగురు స్నేహితులతో కలిసి బొగత జలపాతాన్ని వీక్షించేందుకు వచ్చారు. అదే క్రమంలో జలపాతం వద్ద ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తుండగా జస్వంత్ ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో మునిగిపోయాడు. ఇది గమనించిన సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. జలపాతం వద్ద వరద ఉద్ధృతి ఎక్కువగా ఉన్న సమయంలో పర్యాటకులను స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు అనుమతించడంపై విమర్శలు తలెత్తుతున్నాయి.

స్నేహితులతో సరదాగా గడపాలని : విహారయాత్రలో స్నేహితులతో సరదాగా గడపాలని వచ్చిన వారిలో ఒకరు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందడంతో తోటి మిత్రులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ బండారి కుమార్, వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. స్నేహితులైన ధర్మ తేజ, సాయి కిరణ్, సుశాంత్, నాగేంద్ర, వంశీ, గౌస్‌ల నుంచి వివరాలు సేకరించారు. ఈ నెల 22న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులతో కలిసి బొగత జలపాతాన్ని వీక్షించారు. జలపాతం వద్ద ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆమె సూచించారు. పర్యాటకులకు మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి సీతక్క బొగత జలపాతాన్ని సందర్శించిన మరుసటి రోజే యువకుడు ఈతకు వెళ్లి మృతి చెందడం గమనార్హం.అధికారుల సూచనలు తప్పక పాటించాలి, లేకపోతే అంతే సంగతి వరద ప్రవాహం అధికం కావడంతో బోగత వాటర్ పాల్స్ వద్దకు పర్యాటకులను అనుమతించడం లేదు. నీటి ఉధృతి ఎక్కువగా ఉందని, పర్యాటకులు ఎవరూ బోగత వాటర్ ఫాల్స్ చూసేందుకు తదుపరి ప్రకటన వరకు రాకూడదని అధికారులు హెచ్చరించారు. ప్రమాద స్థాయిలో నీటి ప్రవాహం ఉండటంతో బొగత జలపాతం వద్దకు పర్యాటకులకు అనుమతి లేదు. నీళ్లలోకి సైతం అంతేకాకుండా దిగకూడదని ఫారెస్ట్ అధికారులు, ఇతర సిబ్బంది చెబుతున్నా కొందరు పట్టించుకోవడం లేదు.

## కేంద్ర బడ్జెట్ బాధాకరం : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

నిధులు అభ్యర్థిస్తూ కేసీఆర్ అనేకసార్లు లేఖలు కూడా రాశారన్నారు. ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐఐఎం సహా వివిధ కేంద్ర జాతీయ సంస్థలను ఇవ్వమని తాము కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు.

తెలంగాణ నుంచి ముంబైనాగపూర్, బెంగళూరుచెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినప్పటికీ వాటి గురించి స్పందన లేదని మండిపడ్డారు. మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు నూతన హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగినప్పటికీ కేంద్రం స్పందించలేదన్నారు. తెలంగాణ సీఎం, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో మరోసారి గుండు సున్నా దక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలని సూచించారు. అదే 16 స్థానాలున్న ఏపీకి, బీహార్‌కు దక్కిన నిధులు చూసి తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో మరోసారి ఈ బడ్జెట్ తెలియజేస్తోందన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు పార్లమెంట్‌లో ఒక్క మాటా మాట్లాడలేదని విమర్శించారు. సభలో కూర్చున్న ఎంపీలు కనుక గులాబీ కండువా కప్పుకొని ఉంటే... కచ్చితంగా నిలదీసేవాళ్లమన్నారు. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా బీజేపీ ఇచ్చింది గుండు సున్నా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పునర్విభజన చట్టం పేరు చెప్పిన ప్రతిసారి ఎక్కడా తెలంగాణ అనే పదం ప్రస్తావించలేదన్నారు. ఏపీకి నిధులు ఇచ్చిన కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదన్నారు. ఏపీకి భారీ నిధులు ఇవ్వడం పట్ల తమకు ఎలాంటి దుగ్ధ లేదు... కానీ తెలంగాణ మాటేమిటని ఆయన ప్రశ్నించారు.

## వికసిత్ భారతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



కల్పనకు పలు ప్రతిపాదనలు చేశారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్యాలను వివరించిన మంత్రి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా భవిష్యత్ సంస్కరణలకు కూడా పెద్దపీట వేస్తామన్నారు.

**మౌలికరంగంలో భారీగా పెట్టుబడులు**

మౌలిక రంగంలో ప్రైవేటు పెట్టుబడులను భారీగా పెంచడమే లక్ష్యంగా బడ్జెట్‌లో చర్యలు చేపట్టినట్లు వివరించిన ఆర్థిక మంత్రి మూలధన వ్యయం కింద రూ.11 లక్షల కోట్లు ప్రతిపాదించారు. మౌలిక రంగానికి ఆర్థికంగా పూర్తి భరోసా ఇస్తామన్న రాష్ట్రాలకు సైతం వాటి అభివృద్ధి ప్రాధాన్యాలకు అనుగుణంగా మద్దతు ఇస్తామని చెప్పారు. దీర్ఘకాలిక రుణాలకు వడ్డీ రాయితీలో భాగంగా లక్షా 50 వేల కోట్లు కేటాయించారు.

**బడ్జెట్ ప్రకటన అనంతరం ధర పెరగనున్న, తగ్గనున్న వస్తువులు ఇవే!**

కేంద్ర బడ్జెట్ 2024-25 ప్రకటనతో కొన్ని వస్తువుల ధరలు పెరగనుండగా మరికొన్నింటి ధరలు తగ్గనున్నాయి. ప్రభుత్వం మరో 3 క్యాన్సర్ చికిత్స ఔషధాలను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయిస్తోందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దీంతో క్యాన్సర్ ఔషధాల ధరలు తగ్గనున్నాయి. మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గిస్తున్నట్లు సీతారామన్ ప్రకటించారు. దీంతో రిటైల్ మార్కెట్‌లో ఫోన్ల ధరలు, ఛార్జర్లు, ఇతర మొబైల్ విడిభాగాల ధరలు కూడా తగ్గనున్నాయి. ఇక తోలుతో తయారు చేసిన వస్తువులు, సముద్రపు ఆహారాల (సీ ఫుడ్) ధరలు కూడా చౌకగా మారనున్నాయి. దేశీయంగా భారీ డిమాండ్ ఉన్న బంగారం, వెండి దిగుమతులపై కూడా దిగుమతి సుంకాన్ని తగ్గిస్తున్నట్టు సీతారామన్ పేర్కొన్నారు. 10 నుంచి 6 శాతానికి సుంకం తగ్గించడంతో విలువైన ఈ రెండు మెటల్స్ ధరలు తగ్గనున్నాయి. దిగుమతి సుంకం తగ్గించడంతో దేశీయంగా బంగారానికి మరింత డిమాండ్ ఏర్పడనుందనే అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్ నిరోధానికి కూడా ఈ ప్రకటన ఉపయోగపడుతుందని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఇక ప్లాటినమ్ దిగుమతులపై సుంకాన్ని 6.4 శాతానికి తగ్గిస్తున్నట్టు బడ్జెట్‌లో కేంద్రం పేర్కొంది. దీంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి.

**ధరలు పెరగనున్న వస్తువులు ఇవే..**

పర్యావరణ హితం కోరుతూ కొన్ని ప్లాస్టిక్ ఉత్పత్తుల దిగుమతులపై ప్రభుత్వం సుంకాలను పెంచింది. అమ్మోనియం నైట్రేట్‌పై 10 శాతం, బయోడిగ్రేడబుల్ సాధ్యంకాని ప్లాస్టిక్‌పై 25 శాతం కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. దీంతో ప్లాస్టిక్ వస్తువుల ధరలు పెరగనున్నాయి. టెలికం పరికరాల ధరలు కూడా పెరగనున్నాయి.

## రాజకీయ కక్షతోనే నా కుమార్తెను జైల్లో పెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

విషయాలపై మాట్లాడారు. అందులో భాగంగానే కవిత అరెస్ట్‌పై స్పందించారు. పార్టీలో క్లిష్ట పరిస్థితులు ఏమీ లేవని.., ఇంతకంటే ఇబ్బందికర పరిస్థితుల్లోనే తెలంగాణ సాధించామని తెలిపారు. నలుగురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఎమ్మెల్యే, బాగా ఎదుగుతారని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కార్ పాలనపై పట్టు సాధించలేకపోయిందని, పాలనపై దృష్టి పెట్టకుండా బద్నాం చేసే పనిలో ఉన్నారని ధ్వజమెత్తారు.

**బడ్జెట్ సమావేశాల వ్యూహం ఖరారు**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశమైన బీఆర్ఎస్ శాసనసభా పక్షం బడ్జెట్ సమావేశాల వ్యూహాన్ని ఖరారు చేసింది. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. నిరుద్యోగుల సమస్యలు అక్రమ అరెస్టులు, హామీలు అమల్లో వైఫల్యం, రుణమాఫీ, పౌరసరఫరాల శాఖలో కుంభకోణాలు, నకిలీ మద్యం వ్యవహారం, ఆర్టీసీ విలీనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పెన్షన్లు, శాంతి భద్రతలు, విదేశీ విద్యానిధి, తదితర అంశాలను ఉభయసభల్లో లేవనెత్తాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ ఆరోపించింది. వాటి వెనకున్న అదృశ్య శక్తుల నిగ్గు తేల్చాలని డిమాండ్ చేసింది. మాట నిలబెట్టుకోవాలని కోరుతున్న నిరుద్యోగుల వీపులు పగలగొడుతున్నారని, అక్రమ అరెస్టులు, కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తోందని గులాబీ పార్టీ మండిపడింది. నిరుద్యోగుల అంశంపై రేపు వాయిదా తీర్మానం ఇచ్చి పోరాడాలని నిర్ణయించారు.

### మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా మధుసూదనాచారి



శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా, ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శాసనసభలో కేసీఆర్ ప్రతిపక్షనేతగా ఉన్నందున, మండలిలో బీసీకి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే శాసనసభ, మండలిలో బీఆర్ఎస్ పక్ష కార్యవర్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత 25, 26 తేదీల్లో మేడిగడ్డ, కన్నేపల్లి పర్యటనకు వెళ్లాలని బీఆర్ఎస్ శాసనసభా పక్షం నిర్ణయించింది. గోదావరిలో ఉన్న నీటిని ఎత్తిపోసి రైతులకు నీరు ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఇవ్వడం లేదని, జలాశయాలకు నీటిని మళ్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పర్యటన చేపట్టనున్నట్లు పేర్కొంది. పార్టీ ఫిరాయింపుల విషయమై సభలో ప్రత్యేకవ్యూహంతో ముందుకెళ్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని అన్నారు.

## ఇది కుర్చీ బచావో బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

దుయ్యబట్టారు. ప్రధానిని మేం పెద్దన్నగా భావిస్తే, ఆయన మాత్రం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్ర ప్రజల నిర్ణయం వల్లే మోదీ ప్రధాని అయ్యారన్న సీఎం, 35 శాతం ఓట్లు, 8 సీట్లిచ్చిన ప్రజల పట్ల కృతజ్ఞత చూపించలేదని విమర్శించారు. రాష్ట్ర హక్కులపై రేపు అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 8 మంది కాంగ్రెస్ ఎంపీలు కేంద్రానికి నిరసన తెలుపుతారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధికి నిధులివ్వాలని కోరితే పట్టించుకోలేదని విమర్శించారు. విద్యా, వైద్యం, నీటి పారుదల రంగాలకు ఎలాంటి సహకారం అందించలేదని దుయ్యబట్టారు. ఐటీఐఆర్ కారిడార్‌ను చేపట్టాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. తెలంగాణకు ఐఐఎం ఇవ్వలేమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనకు లేఖ రాశారని, అలాంటప్పుడు కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఎందుకు కొనసాగుతున్నారని సీఎం ప్రశ్నించారు.

## 8 మంది ఎంపీలను గెలిపిస్తే ఇదా రిటర్న్ గిఫ్ట్?

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు.కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై మధుయాష్కి గౌడ్ స్పందిస్తూ.. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో అన్యాయాలపై తెలంగాణ సమాజం పోరాడిందని.. తెలంగాణ ఏర్పడిన తర్వాత దురదృష్టవశాత్తు కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తెలంగాణకు నీళ్లు, నిధులు , ప్రాజెక్టుల కేటాయింపులలో తీరని అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి సహాయం చేసి ఆదుకోవాల్సిన కేంద్రం.. తెలంగాణ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపించారని విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపిస్తే, ప్రజలకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ గుండు సున్నేనా ..? అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చి, మిగతా రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సమంజసం కాదన్నారు. మరీ ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల పట్ల బడ్జెట్లో తీవ్ర వివక్ష కనిపించిందన్నారు. దేశమంటే కొన్ని రాష్ట్రాల అభివృద్ధి మాత్రమే కాదని, అన్ని రాష్ట్రాలు అభివృద్ధి సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేకంగా రూపాయి కూడా కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు ఏ మొహం పెట్టుకొని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల మోదీ ప్రభుత్వ వివక్ష ఎంత ఉందో ప్రజలు ఈ సందర్భంగా గమనించాలని సూచించారు. బీజేపీ ఎంపీలను ప్రజలు నిలదీయాలని సూచించారు. .తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, కొత్త రైల్వే లైన్లు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐ టి ఐ ఆర్ ప్రాజెక్టుల ఊసే లేదన్నారు.తెలంగాణ అభివృద్ధి చెందుతుంది అంటే.. స్వశక్తితోనేనని పేర్కొన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాల అమలుతో తెలంగాణలో దేశంలోనే నంబర్ వన్ గా నిలుస్తూ, అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్న తెలంగాణను చూసి మోదీ ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని మధుయాష్కి గౌడ్ విమర్శించారు.

## తెలంగాణ అనే పదమే ఉచ్చరించలేదు



**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈరోజు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తుంటే బాధ కలుగుతోందన్నారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే ఉచ్చరించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పేరును అనేకసార్లు ఉచ్చరించారని, కానీ తెలంగాణను పక్కన పెట్టారన్నారు. మీడియా పాయింట్ వద్ద ఆయన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ ఏపీలో పోలవరం త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారని, ఏపీ రాజధానికి డబ్బులు ఇస్తామని చెప్పారని, రాయలసీమతో పాటు ఆంధ్రాలోని వెనుకబడిన జిల్లాలకు ఫండ్స్ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఏపీ విషయంలో ప్రత్యేకంగా ఈ అంశాలను ప్రస్తావించడం సంతోషమే కానీ, తెలంగాణ విషయం ఏమైందో చెప్పాలన్నారు. మరి ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలన్నారు. కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నామని... మోదీకి దగ్గరగా ఉన్నామని... కేంద్రమంత్రులను రోజూ కలుస్తున్నామని రేవంత్ రెడ్డి చెబుతున్నారని... మరి నిధుల కేటాయింపు పై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. కనీసం తెలంగాణ ప్రస్తావన కూడా లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకు అన్యాయం చేశాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాలకు బడ్జెట్ లో కేటాయింపులు చేశారన్న హరీశ్‌రావు తెలంగాణలో తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాలకు జిల్లాలకు మొండి చేయి చూపారన్నారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏమి చేస్తున్నట్లని ప్రశ్నించారు. కేంద్రం తెలంగాణకు గుండు సున్నా ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

**విశ్వంభర, హైదరాబాద్:** లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 202425లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణను పూర్తిగా విస్మరించారని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.బడ్జెట్ రాజకీయ ప్రేరేపితమైందని, ప్రజల కోసం కాదని, బీజేపీ మిత్రపక్షాలు, జేడీయూ, టీడీపీలను ప్రసన్నం చేసుకునేందుకే బడ్జెట్‌ను రూపొందించారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీహార్‌కు రూ.41,000 కోట్ల ఆర్థిక సాయం అందించగా, ఆంధ్రప్రదేశ్‌కు రూ.15,000 కోట్లు, పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు సహా ఇతర నిధులు వచ్చాయి.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, ముఖ్యంగా తెలంగాణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. "2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇది 11వ బడ్జెట్, కానీ కొత్త రాష్ట్రాన్ని కేంద్రం నిర్లక్ష్యం చేసింది.. 2014 తర్వాత మొదటిసారిగా, బడ్జెట్‌లో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం' పేరుతో ప్రత్యేక అధ్యాయాన్ని పొందుపరిచారు, కానీ ఆర్థిక 58 పేజీలు, 14,692 పదాలున్న తన మొత్తం ప్రసంగంలో మంత్రి తెలంగాణ అనే పదాన్ని ప్రస్తావించలేదని అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం గురించి మాట్లాడినప్పుడు తెలంగాణ ప్రస్తావనను పూర్తిగా దాటవేయడాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రత్యేక నిధులు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకించనప్పటికీ, తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామని, ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ మంత్రుల బృందం గత ఏడు నెలలుగా అన్ని మంత్రిత్వ శాఖలకు నిధులు ఇవ్వాలని కోరుతూ పలు దరఖాస్తులు సమర్పించామని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం పాలమూరు రంగా లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఎలాంటి హామీ ఇవ్వలేదని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు అప్పటి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు.

'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోందని' ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను బీజేపీ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్న ఆశతో తెలంగాణ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్నారని, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీకి నిధులు, హైస్పీడ్ రైలు కనెక్టివిటీ , చట్టంలో చేసిన ఇతర వాగ్దానాలు అమలు చేయాలని అన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తర కోస్తాంధ్రలోని వెనుకబడిన ప్రాంతాలకు ఎంపిక చేసి గ్రాంట్లు మంజూరు చేశారని, అయితే తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల ప్రస్తావనను దాటవేయాలని నిర్ణయించుకున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేరుస్తామని ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో చేసిన హామీలు నెరవేరుతాయని భావిస్తున్నామని ఆయన అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా ఎనిమిది మంది బిజెపి ఎంపీలు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తగిన వాటాను పొందడంలో విఫలమయ్యారని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్రానికి వనరులు, సంక్షేమ పథకాల్లో వాటా దక్కకుండా చేసిన కేంద్ర బడ్జెట్ తెలంగాణకు తీవ్ర నిరాశ కలిగించిందని అన్నారు.

## నీట్ రీ ఎగ్జామ్ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదని మంగళవారం పేర్కొంది. తాజాగా మరోసారి నీట్‌యూజీ పరీక్షలు నిర్వహిస్తే.. తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని తాము గ్రహించామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. కాగా.. 24 లక్షల మంది ఈ పరీక్షలు రాయగా, మరోసారి వీటిని నిర్వహిస్తే వాళ్లపై అది ప్రభావం చూపుతుందని సుప్రీం తెలిపింది. నీట్ పేపర్ లీకైంది వాస్తవమేనని తేల్చిన సుప్రీంకోర్టు.. నీట్ నిర్వహణలో లోపాలున్నాయని తెలిపింది. పేపర్ లీక్ ద్వారా 155 మంది లబ్ధి పొందారని.. కాపీ కొట్టిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని సూచించింది. హజారీబాగ్, పాట్నాలోనే పేపర్ లీక్ అయ్యిందని స్పష్టం చేసింది. మరోసారి నీట్ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం లేదని, నీట్‌ను రద్దు చేస్తే 24 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడుతుందని వెల్లడించింది. నీట్‌పై అభ్యంతరాలను ఆగస్టు 21న వింటామని చెప్పుకొచ్చింది. దీంతో.. నీట్ కౌన్సిలింగ్ యథావిధిగానే కొనసాగనుంది. ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా.. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే.. ఫలితాలు తేడాగా రావడంతో లీకేజ్ వ్యవహారం తెరమీదకు వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా.. 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంతో అనుమానాలు రేకెత్తాయి. అందునా.. హర్యానాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. దీంతో.. అంతమందికి టాప్ ర్యాంక్ ఎలా వచ్చిందంటూ విద్యార్థులకు ఆందోళనకు దిగారు.

# అర్హులకు రైతు రుణ మాఫీ

## కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి :** సాంకేతిక కారణాలతో రైతు రుణమాఫీ జరగని రైతుల సమస్యను పరిష్కరించి అర్హులకు రుణమాఫీ చేసేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో రైతు రుణమాఫీపై జిల్లా వ్యవసాయ అధికారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 16,502 మంది రైతులకు లక్ష లోపు రుణమాఫీ జరుగనుందని తెలిపారు. ఇందులో సహకార బ్యాంక్ లలో 2,853 మంది రైతులకు 13.61 కోట్లు, వాణిజ్య బ్యాంకులలో 13,649 మందికి 80.5 కోట్లు రుణం మాఫీ జరిగిందని, ఇందులో ఎవరికైనా రుణమాఫీ జరగకపోతే మండల లేదా జిల్లా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో మిగిలిన రైతులకు రుణమాఫీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యను పరిష్కరించి త్వరలోనే రుణమాఫీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన విధంగా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ జరుగుతుందని అపోహ చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు శ్రీ బాపు సహాయ వ్యవసాయ సంచాలకులు (టెక్నికల్) 7288894710 కు గానీ, జిల్లా వ్యవసాయాధికారి ఎం. విజయ భాస్కర్ 7288894787 కు గానీ సంప్రదించగలరు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి పరివాహక ప్రాంతాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటన

**విశ్వంభర, భూపాలపల్లి :** భారీ వర్షాల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కె వెంకటేశ్వర్లు గోదావరి పరివాహక ప్రాంతాలైన పల్గుల, కుంట్లం గ్రామాలను సందర్శించారు. మద్దులపల్లి క్రాస్ నుండి పల్గులకు వెళ్లే రహదారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉన్నందున జాయింట్ కలెక్టర్ బైక్ పై వెళ్లి ఆయా గ్రామాలను సందర్శించారు. అక్కడి ప్రజలకు వరదలు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపి తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కాళేశ్వరం గ్రామ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## మనిషి గౌరవాన్ని నిలబెట్టేది విద్య ఒక్కటే

**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండలం వెలుగు రాళ్ల తండా కు చెందిన ఇస్లావత్ మారుతి కుమార్ జేఈఈ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 391వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ వెంమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మండల మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ విద్యార్థిని సత్కరించి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నుండి 5,000 రూపాయలు నగదు అందించారు. ఎస్టీ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంకు సాధించడం గిరిజన జాతికి గర్వకారణం అని మెచ్చుకున్నారు. అదేవిధంగా ఇంకా ఉన్నత చదువు అభ్యసించడానికి మా ట్రస్టు ద్వారా సహాయం అందజేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి దేశానికి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు, శ్రీను, కృష్ణ, శ్రీను చందర్, వెంకటేష్, రతన్, గణేష్ రవి నాయకులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అందచేసిన ఎస్సై కృష్ణయ్య

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అందచేసిన ఎస్సై ఎస్ కృష్ణయ్య రికవరీ చేసి అందచేశారు. వారు మాట్లాడుతూ ప్రజలంతా వ్యక్తిగత వస్తువుల విషయంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే మీ వస్తువులను కోల్పోకుండా ఉంటారని ఎస్సై అన్నారు. ఆత్మకూరు(ఎం) మండలానికి చెందిన ముగ్గురు మొబైల్ ఫోన్లు పోగొట్టుకునీ పోలీసులకు ఫిర్యాదు చేసినందున వారి ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో సీఈఐఆర్ ద్వారా కనిపెట్టి బాధితులు ఆత్మకూరుకి చెందిన గట్టు శంకర్, రహీమ్‌ఖాన్‌పేటకు చెందిన మల్లయ్య,




మోటాకొండూర్ మండలం తేర్యాలకు చెందిన చొప్పరి భిక్షపతిలకు అందచేసారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్సైకి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఎంపీ చామలా కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** మోటాకొండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మోటకొండూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యేల్లంల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మోటాకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్ ఆధ్వర్యంలో జరిపారు. జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మండల అధ్యక్షులు సిరబోయిన మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా ఎంపీకి జన్మదినోత్సవ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గిరాబోయిన మల్కయ్య, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అనంతుల ఎల్లారెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు రేగు చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు భువనగిరి ఎల్లయ్య, యూత్ జిల్లా నాయకులు జంపాలా నాగ చందర్, కాంబోజు నాగరాజు, భూమండ్ల బంగారి, ఎన్ఎస్యూఐ జిల్లా కార్యదర్శి రేగు రమేష్, సినియర్ నాయకులు బీరకాయల యదగిరి, గాజుల వెంకటేష్ గౌడ్, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంబోజు పరశురాములు, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు బల్ద రాజు, వంగ శివ కుమార్, కొత్తపేట మహేష్, కొరటికంటి మహేష్, మేడికుంటపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దశరథ రెడ్డి, సీసా రాములు, భూమండ శ్రీశైలం, కట్కూరి రఘు, రేగు ఇస్తారి, కాంబొజు రమేష్, గడ్డం మహేష్ పాల్గొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమానికి 5,000 కోట్లను కేటాయించాలి




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 50 లక్షల గౌడ గీత కార్మిక కుటుంబాల సంక్షేమానికి 5,000 కోట్ల రూపాయలను కేటాయించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోలగాని జయరాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆత్మకూర్ (ఎం) పట్టణ కేంద్రంలోని గౌడ సంఘం ఆఫీసులో మండల గౌరవ అధ్యక్షులు గడ్డం దశరథ గౌడ్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జయరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చేతివృత్తులలో అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తి అని, అట్టి వృత్తిలో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల జనాభా ఉన్నారని వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం 5,000 కోట్ల రూపాయలను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాలు కల్లుగీత గౌడ కుటుంబాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని మాటల వరకే వారి ప్రకటనలను పరిమితమవుతున్నాయని నిర్దిష్టంగా ప్రణాళిక బద్ధంగా వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేస్త లేవని విమర్శించారు. ప్రభుత్వాలను మార్చిన చరిత్ర గౌడ కల్లుగీత కార్మికులకు ఉన్నదని గత ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందున గీత కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చిందని, ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే వాటిని అమలు చేయాలని, ప్రతి గీతా కార్మికుడికి మోటార్ బైక్‌లు ఇవ్వాలని, ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి కెటాయించాలని, కల్లుగీత వృత్తిలో ప్రమాదాలకు గురవుతున్న గీత కార్మికుల ఎక్స్ గ్రేషియాలను ఐదు లక్షల రూపాయల నుండి 10 లక్షలు రూపాయలకు పెంచాలని, నందనంలో నీర ఉత్పత్తి కేంద్రానికి నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి ప్రారంభించాలని, గౌడ గీత కార్మికుల కుటుంబాల యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, ప్రతి వ్యక్తికి రెండు లక్షల రూపాయల సబ్సిడీ రుణం అందించాలని, గీత వృత్తిలో హైబ్రిడ్ తాటి ఈత చెట్లను ప్రభుత్వం అన్ని గ్రామాలలో సొసైటీలకు కేటాయించి నాటేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఉన్న పెండింగ్ ఎక్స్ గ్రేషియాలను వెంటనే విడుదల చేయాలని, గీత కార్మికులందరికీ సేఫ్టీమోకులు అందించాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్‌ని కల్లు గీత కార్మిక సంఘం ఆత్మకూరు(ఎం) మండల కమిటీ పక్షాన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు మల్లేశం గౌడ్, మండల గౌరవ అధ్యక్షులు గడ్డం దశరథ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పరకాల అంజయ్య గౌడ్, మండల కోశాధికారి పంజాల నరసయ్య గౌడ్, మండల నాయకులు నాతి రాజు గౌడ్, పంజాల సత్తయ్య గౌడ్, కూరెళ్ళ సుభాష్ గౌడ్, కోల రాములు గౌడ్, ముద్దసాని శంకరయ్య గౌడ్, అంజయ్య గౌడ్, యాదగిరి గౌడ్, ఎల్లయ్య గౌడ్, స్వామిగౌడ్, బస్వం వీరస్వామి గౌడ్ పాల్గొన్నారు.

## మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు

**విశ్వంభర, భూపాలపల్లి :** మహిళల ఆర్థిక స్వావలంబనకు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై ఐడివోసీలో రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ ఏర్పాటు గురించి డీఆర్డీఓ నరేష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం జిల్లాలోని అన్ని మండలాలల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు అలాగే ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటుకు మహిళా సంఘాల ద్వారా ప్రతిపాదనలు స్వీకరించాలని డీఆర్డీఓను ఆదేశించారు. ఐడీఓసీలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయకున్న క్యాంటీన్ నాణ్యతకు ఆదర్శంగా నిలవాలని ఆయన తెలిపారు. సాంప్రదాయ వంటకాలను జిల్లా ప్రజలకు పరిచయం చేయాలని ఆయన పేర్కొన్నారు. స్థానికంగా లభ్యమయ్యే వనరులు, వస్తువుల ఆధారంగా అవసరాలకు తగ్గట్టుగా మహిళా శక్తి క్యాంటీన్ కు బిజినెస్ మోడల్స్ రూపొందించాలని డీఆర్డీఓకు సూచించారు. మన జిలాల్లో మండల, ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్లు మోడల్ గా ఉండాలని ఆయన పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని వ్యాపార వేత్తలుగా ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసిన రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత.. ఆర్య వైశ్య కార్పొరేషన్ కొత్తగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో తగిన విదంగా బడ్జెట్ లో నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేసిన చైర్ పర్సన్ సుజాత.



## సర్వేంద్రియానం నయనం ప్రదానం

### టీజేయూ కంది చంద్రకళ రెడ్డి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం నాంచారి పేట గ్రామంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కంది చంద్రకళ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ కేంద్రంలోని సుమంత్ కంటి హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంది చంద్రకళ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రదానం అని పెద్దలు చెప్పిన మాట ప్రకారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పటు చేసినట్లు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి టీజేయూ ప్రతినిధులు విచ్చేసి కంటి వైద్య నిపుణుల పర్యవేక్షణలో కంటి పరీక్షలు చేపించుకుని మందులు, అద్దాలు తీసుకున్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పటు చేసి విజయవంతం చేసిన జిల్లా టీజేయూ కుటుంబ సభ్యులకు, టీజేయూ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావుకి, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షానూర్ బాబాకి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా పాలన దరఖాస్తుల సరిచేసేందుకు సేవా కేంద్రం

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజాపాలన దరఖాస్తులు తప్పులను సరి చేసేందుకు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం జి8,మొదటి అంతస్థులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అయన తనిఖీ చేసి పోర్టల్ లో తప్పులను సరి చేయు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజలు సంక్షేమ పథకాలు లబ్ధికి ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్నారని, అట్టి లబ్ధిదారులు దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరిచేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ యొక్క సేవా కేంద్రాలలో ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులను సరి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ శామ్యూల్, ఈడియం శ్రీకాంత్ పాల్గొన్నారు.





## ఆర్డీవో వాహనం బైకును ఢీకొనగా ఇద్దరి పరిస్థితి విషమం

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని పరకాల–భూపాలపల్లి కొంపెల్లి క్రాస్ ప్రధాన రహదారిపై భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మంగీలాల్ వాహనం బైకును ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. పుల్లురాయపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సంపత్, గుడాల ఎల్లయ్యలకు తీవ్రగాయాలు కాగా వారిని భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## గాంధీ భవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
# పుట్టినరోజు వేడుకలు

**విశ్వంభర, గాంధీ భవన్ :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈరోజు గాంధీ భవన్ లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్, టీపీసీసీ మీడియా కో ఆర్డినేటర్లు శ్రీకాంత్ యాదవ్, వచన్ కుమార్, ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
# అన్ని రంగాల్లో రాణించాలి

**విశ్వంభర, ఎల్బీసగర్ :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమంగా రాణించాలని బ్యాంక్ అఫ్ బరోడా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శైలెందర్, సర్వీస్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవి కుమార్ అన్నారు. బ్యాంక్ అఫ్ బరోడా ఫార్మేషన్ డే సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వీస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మోహన్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బాగ్స్, మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు ఏకాగ్రత తో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. మోహన్ నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారయణ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు చేయూతను అందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వీస్ బ్రాంచ్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. మోహన్ నగర్ ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ కట్టా ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఆనంద్ కుమార్, మేనేజర్ వి. రామారావు, అమూల్య, యోగ టీచర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు శోభారాణి, సునీతా, అరుణా జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగ శిక్షణ మోహన్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యోగ టీచర్ శ్రీదేవి యోగా శిక్షణ ఇచ్చారు. వివిధ ఆసనాలను గురించీ వివరించడంతో పాటు విద్యార్థుల చేత చేయించారు.

## ఐపీఎస్ అధికారి సబర్వాల్‌పై
# చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, షాద్‌నగర్ :** వికలాంగులను కించపరిచే విదంగా పోస్ట్ పెట్టిన ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ఎస్సై శరత్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్ వికలాంగులను కించపరిచే విదంగా జులై 21న ట్విట్టర్ లో అంధుడిని కారు డ్రైవరుగా నియమిస్తామా? వైకల్యం ఉన్న వైద్యుడితో శస్త్రచికిత్స చేయించుకుంటామా' అని పోస్ట్ పెట్టినారు. దీంతో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు భుజంగారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె పెట్టిన పోస్ట్ ఐక్య రాజ్యా సమితి హక్కుల ఒప్పంద పత్రం, 2016 ఆర్.పీ.డబ్ల్యూ.డీ చట్టంలో పేర్కొన్న సమానత్వం, వికలాంగుల పట్ల వివక్షతకు పూర్తి భిన్నమైంది. వికలాంగులను కించపరిచే ఉద్దేశంతో బహిరంగంగా ఉద్దేశపూర్వకంగా అవమానించారు. వికలాంగులను అగౌరవపరి చెందుకు ప్రయత్నం చేశారు. 2016 ఆర్.పీ. డబ్ల్యూ.డీ చట్టం సెక్షన్ 34 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగుల కొరకు ప్రత్యేకంగా వైకాల్యాన్ని బట్టి రిజర్వ్ పోస్టులు గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని స్పష్టంగా ఉంది. వికలాంగుల హక్కుల చట్టాన్ని కించ పరుస్తూ మాట్లాడిన స్మిత సభర్వాల్ పై కేసు నమోదు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు :** భారతీయ మజ్దూర్ సంఘ్ యూనియన్ ఆవిర్భావ వేడుకలను ఆమనగల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ ఆధ్వర్యంలో పట్టణానికి సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్ మిల్ వద్ద యూనియన్ జెండాను ప్రధాన కార్యదర్శి లక్యా నాయక్ ఆవిష్కరించి కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బీఎంఎస్ ఎందుకు ఏర్పడిందో, సంఘం చేసిన సేవలను కార్మికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ యాదయ్య, శంకర్, సభ్యులు చందర్, పంతు, మల్లిక్, రాజు, అలివేలు, విజయ, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారావు, అప్పారావు పాల్గొన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ఎన్నిక



**విశ్వంభరన, హైదరాబాద్ :** తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం నూతనంగా ఎన్నికైంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాజీ టి.ఎన్.జీ.ఓ. అధ్యక్షులు, మాజీ శాసన మండలి చైర్మన్ శ్రీ స్వామీగౌడ్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మాజీ సభ్యులు శ్రీ సుధాకర్, శ్రీ కారం రవీందర్రెడ్డి, బెవరేజస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ శ్రీ జి. దేవి ప్రసాదరావు, శ్రీ మామిండ్ల రాజేందర్ టీ.ఎన్.జీ.ఓ. ఇతర నేతలు నాయకత్వాన్ని అభినందించారు. కొత్తగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు బి. శ్యామ్, ట్రెజరర్ ఉపేందర్రెడ్డి, జగన్మోహన్రావు, పరమేశ్వర్రెడ్డి, రామకృష్ణాగౌడ్, దీపారెడ్డి, యాదగిరి, జి. వేంకటేశ్వర్లు, కృష్ణాయాదవ్, రామారావులను పుష్పగుచ్ఛము, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంలో మాట్లాడిన వక్తలు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రస్తుత నాయకత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఎన్నికైన అనతి కాలంలోనే ఏలూరి శ్రీనివాసరావు నాయకత్వంలో ఉద్యోగులకు సంబంధించి పలు సమస్యలు పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం, నానెజిటెడ్ అధికారుల సంఘాలు ఉద్యోగులకు రెండు కళ్ల లాంటివని, రెండు సంఘాలు సమన్వయంతో పనిచేసి ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగ సంఘాల జే.ఏ.సీ. పక్షాన కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రెండు సంఘాలు చేసిన కృషిని, చేపట్టిన కార్యక్రమాలు, సాధక బాధలను నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీ.ఎన్.జీ.ఓ. సచీవాలయ మాజీ అధ్యక్షులు ఎస్. సురేష్ కుమార్, డి.కిషన్ ప్రసాద్, ప్రవీణ్, ఇతర నేతలు పాల్గొన్నారు.

# మా భూములని రక్షించాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు బాధిత రైతుల వినతి




**విశ్వంభర, నారాయణపూర్ :** మా సాగు భూముల్లో పోలీసు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయకుండా మీరే రక్షించాలని కోరుతూ మంగళవారం బాధిత రైతులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. నారాయణపూర్ మండల కేంద్రంలోని 255 సర్వే నెంబర్లో సుమారుగా 130 మంది రైతులు భూములను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం కేవలం 15 మంది మాత్రమే కబ్జాలో ఉన్నట్టు తప్పుడు రిపోర్టులు ఇచ్చినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 70 ఏళ్లుగా ఇదే భూములను నమ్ముకుని జీవిస్తున్న మా భూముల్లో పోలీసు శిక్షణ శిబిరం ఏర్పాటయితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని సాంబశివరావు ముందు ఆవేదన వెళ్లిపోచుకున్నారు. పోలీసు శిక్షణ శిబిరాన్ని మరోచోటికి మార్పించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పోలీసు శిక్షణ శిబిరాన్ని మరోచోటకు మార్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా నాయకులు బచ్చన గాని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సహాయ కార్యదర్శి సిలివేరు అంజయ్య, బాధిత రైతులు సిలువేరు వీరేశం, సిలువేరు అంజయ్య, మెగావత్ నరసింహ, బానోతు బాలకృష్ణ ఉన్నారు.

# మోడీ నాయకత్వంలో అన్ని రంగాల్లో దేశాభివృద్ధి

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం ప్రణతి



**విశ్వంభర, నారాయణఖేడ్ :** మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుం దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం ప్రణతి అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు కోణం విట్టల్ అధ్యక్షతన పెద్ద శంకరం పేట బీజేపీ మండల కార్యవర్గ సమావేశం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశాభివృద్ధి మొదలైందని ఆమె పేర్కొన్నారు. మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు మె-ుత్తం భారతదేశం వైపు చూస్తున్నాయని, భారతదేశాన్ని ప్రధానమంత్రి మోడీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఆమె వివరించారు. యువత, మహిళలు వ్యవసాయ రంగం విద్య, వైద్యం, ప్రజా సంక్షేమ తదితర అన్ని వర్గాలకు పలు పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బీ.ఆర్.ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో భారతీయ జనతా పార్టీ గెలుపొందడం ఖాయమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం నడుస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు 2,500 ఇస్తామని ఎన్నికల్లో చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు. గృహజ్యోతికి సంబంధించిన విషయంలో కూడా మహిళలకు కరెంటు బిల్లుల విషయంలో సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం వాటిని వెంటనే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విట్టల్, మండల బీజేపీ నాయకులు బండల శ్రావణ్ కు మార్, మంగలి కృష్ణ, బుగుడాల కృష్ణ, గంగారెడ్డి, సాయి లు, అంజయ్య, విజయ్, సత్యనారాయణ, సుభాష్, రమేష్, రాజు, సురేందర్ ఆయా గ్రామాల బూత్ స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



## కరెంటు స్తంభాలు తొలగించకుండానే సీసీ రోడ్లు

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగండ్ల మండల కేంద్రంలో తలకొండపల్లి నుండి ఆమనగల్లు వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బస్టాండు నుండి బ్రిడ్జి మీదుగా బీసీ కాలనీ వరకు సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కానీ నిర్మాణంలో కరెంటు స్తంభాలను తొలగించకుండానే గుత్తేదారు సీసీ రోడ్లను వేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని పట్టణ ప్రజలు అడుగుతున్నారు. విద్యుత్ అధికారులు గుత్తేదారు సమన్వయ లోపం వల్ల ప్రజలు నష్టపోతున్నారని వాపోయారు. ఇలాంటి ప్రమాదాలు జరగకముందే కరెంటు స్తంభాలను తొలగించి అధికారులు సీసీ రోడ్లు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

# రైతులకు సకాలంలో సాగు నీరు అందించాలి

## పల్లా నరసింహారెడ్డి




**విశ్వంభర, చింతపల్లి :** అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతపల్లి మండల పరిధిలోని పి.కె మల్లేపల్లి గ్రామంలో వింజమూరి అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పల్లా నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం సరైన ప్రణాళికా లేకుండా ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి, బీడు భూములను సస్యశ్యామలం చేయాలని కోరారు. షరతులు లేకుండా కట్ ఆఫ్ తేదీలను ఉపసంహరించుకొని రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. 6 గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి, పార్టీలకు అతీతంగా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలము అందించాలన్నారు. అర్హులైన వారికి పింఛన్లను, ఇండ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండాను గ్రామ గ్రామాన ఎగరవేసి భవిష్యత్తులో, కమ్యూనిస్టు పార్టీ నిర్వహించబోయే పోరాటాలకు ప్రజలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు సాంభ శంకర్, గ్రామ శాఖ కార్యదర్శి ఐతపాక సైదులు, సహాయ కార్యదర్శి ఘనిపల్లి జితేంద్ర, శ్రీకృష్ణ, మల్లయ్య, రామకృష్ణ, కిష్టయ్య, మల్లయ్య, జంగయ్య, విష్ణు, గోపాల్, లచ్చయ్య, దశరథం, బిక్షమయ్య, కొండయ్య, రామచంద్రం, లక్ష్మమ్మ, పర్వతాలు, యాదయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



## పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### మున్సిపల్ చైర్మన్ నరేందర్

**విశ్వంభర, షాద్‌నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీ మంగళవారం 22, 26వ వార్డులలో స్థానిక కౌన్సిలర్లు నడికూడ సరిత యాదగిరి యాదవ్, ఈగ వెంకట్రాంరెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షాకాలం కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థకు చేరిన ఇళ్లను మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లలో ఉన్నవారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షాల వలన ఇంటి చుట్టూ, డబ్బాలలో నిల్వ ఉంచిన నీళ్లను, వర్షంలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను, వాహనాల నుంచి తీసివేసిన టైర్లను తొలగించాలని, శుభ్రత పాటించాలని తెలిపారు. శుభ్రత పాటించడం వలన వాతావరణ మార్పుల వలన వచ్చే రోగాల నుండి మనకు మనం కాపాడుకోవచ్చని అన్నారు. కరెంటు స్తంభాల దగ్గరకు వెళ్ళకూడదని ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రేటికల్ నందిశ్వర్, మున్సిపల్ అధికారులు సాయి బాబా, జావీద్, జవాన్ మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రాణహిత వరద ఉధృతి పరిశీలించిన సీపీ



**విశ్వంభర, భూపాలపల్లి :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణహిత, గోదావరి వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. మంచిర్యాల జోన్ కోటపల్లి మండలం లోని అంతరాష్ట్ర సరిహద్దు బ్రిడ్జ్, అర్జున్ గుట్ట వద్ద ఉన్న ఫెర్రి పాయింట్ సందర్శించి ప్రాణహీత వరద ఉధృతి ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రాణహిత వరదల వలన తలెత్తిన పరిస్థితులను పర్యవేక్షించి పరివాహక ప్రాంత చుట్టు పక్కల ఉన్న గ్రామాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయి, ఎలాంటి అవసరమైన సహాయ చర్యలు గురించి తెలుసుకోవడం కోసం ఈ ప్రాంతాలను సందర్శించినట్లు తెలిపారు. వరదల వలన ఇబ్బంది ఏర్పడిన సమయంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు వెంటనే స్పందించి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా కాపాడడం కోసం శిక్షణా పొందిన సిబ్బందితో పాటు ఒక వాటర్ బోటు, వివిధ రక్షణ పరికరాలతో కూడిన డీడీఆర్ఎఫ్ (డిస్టిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) పోలీసు టీమ్ ఎల్లపుడు అందుబాటులో ఉంచడం జరిగింది అని తెలిపారు. పలు చోట్ల లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడం, లో లెవెల్ బ్రిడ్జ్ లు మునిగి రహదారులపై నుండి వరద ప్రవహించడం వలన రవాణా రాకపోకలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. ముంపునకు గురైన ప్రజలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసువారి సహాయం పొందాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, వరదల వలన ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సీపీ అధికారులను ఆదేశించారు. అత్యవసరమయితే తప్ప బయటకి రావద్దని ఉధృతంగా ప్రవహిస్తున్న నదులను పొంగిపొర్లుతున్న వరద నీటిని, జలపాతాలు, చెరువులు, వాగులను చూడటానికి బయటికి వచ్చి ప్రమాదాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేశారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తదితరులు ఉన్నారు.

## లక్ష్మాపురంలో ఉచిత ప్రాథమిక కంటి పరీక్షలు



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో మంగళవారం రోజు గ్రామపంచా యతీ కార్యాలయంలో శంకర కంటి ఆసుపత్రి నానక్ రామ్‌గూడ శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సురేఖ ఐకేర్అండ్ ఆప్టికల్స్ పీర్జాదిగూడ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ చే ఉచిత ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించడం జరి గింది. ఈ కార్యక్రమానికి దాదాపుగా 60 మంది హాజరు అయ్యారు. ఈ శిబిరంలో 09 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తిం చడం జరిగింది. వీరికి త్వరలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని క్యాంపు నిర్వహకులు డాక్టర్ టి. ఉమామహేశ్వర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీకళ, కోఆర్డినేటర్ బాలరాజు, ఎండి మాజీద్, తాజా మాజీ గ్రామ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పి. రమేష్, కారోబార్ మెండే వెంకటేష్, గ్రామ పెద్దలు నీల మురళి, ఆరూరి పాండు, దేవిరెడ్డి సత్తిరెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ కృష్ణయ్య




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు(ఎం) ఎస్ఐ ఎస్ కృష్ణయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్ గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వ ర్యంలో సైబర్‌నేరాలు, మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్, మాదక ద్రావ్యాలకు దూరంగా వుండాలన్నారు. అలాగే సోషల్ మీడియా ప్రభావం చదువులకు అడ్డంకిగా మారిందని వీటికి దూరంగా వుండాలన్నారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు నేరమని తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. ద్వీచక్ర వాహనదారుడు హెల్మెంట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాసల్గొన్నారు.

## ఆమనగల్లులో అమ్మ బాట అంగన్వాడి బాట



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ ఐసీడీఎస్ మున్సిపల్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రంలో అమ్మ బాట – అంగన్ వాడి బాట' కార్య క్రమంలో భాగంగా "సామూహిక అక్షరాభ్యాసాలు" నిర్వహించారు. ఆమనగల్ ఐసీడీఎస్ సూపర్వైజర్ పార్వతి కార్యక్రమంను ఉద్దేశించి మాట్లాడుతూ మూడు సంవత్సరాల పిల్లలందరూ అంగన్వాడీలో పేర్లు నమోదు కావాలని, దానికి తల్లిదండ్రులు సహకరించాలని అంగన్వాడి కేంద్రాలలో ఆటపాటలు నేర్పించడంతో పాటు చిన్నతనంలో విద్య పైన అవగాహన పెంపొందించి సరైన పౌష్టకాహారం సమయానికి అందించడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శబరి, సరళ, తిరుమల, పద్మ, కవిత, బాలమణి టిచర్లు సంధ్య, రాజ్యలక్ష్మి, రజిత, నాగమణి, లక్ష్మి, సరూప, భబిత విద్యార్థినీ, విద్యార్థుల, తల్లులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య బోధన చేయాలి

- పిహెచ్‌సి లలో వైద్యులు అందుబాటులో ఉండాలి
- ధరణి పెండింగ్ ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**విశ్వంభర, చివ్వెంల :** విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల, మోతే మండలంలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చివ్వెంల మండలం లోని జడ్.పీ.హెచ్.ఎస్ పాఠశాలను తనిఖీ చేసి కలెక్టర్ విద్యార్థుల హాజరు రిజిస్టర్ ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, ఎ సబ్జెక్ట్ లో విద్యార్థులు వెనుకంజలో ఉంటారో ఉపాధ్యాయులు గుర్తించి వారిపై ప్రత్యేక చొరవ తీసుకొని పరీక్షల నాటికి అధిక మార్కులు వచ్చేలాగా కృషి చేయాలని ఉపాధ్యాయులకి సూచించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తమకి తెలియజేయాలని కలెక్టర్ విద్యార్థులతో అన్నారు. మోతే పీ.హెచ్.సీ ని తనిఖీ చేసి సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బంది అందరు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. తదుపరి మెడికల్ రికార్డ్, ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. పీ.హెచ్.సీ కి వచ్చే రోగులకు టెస్ట్ లు చేపట్టి వచ్చే రిపోర్ట్ ఆధారంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మోతే తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసి రికార్డ్స్ నిర్వహణ, ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి త్వరిగతిన దరఖాస్తులను పరిష్కరించి రైతుల సమస్యలు తీర్చాలని అధికారులకు సూచించారు. తదుపరి ఎం.పీ.డీ.ఓ కార్యాలయంలో ప్రజాపాలన హెల్ప్ డెస్క్ ని కలెక్టర్ పరిశీలించి గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల మార్పుల చేర్పులను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మోతే ఎంపీడీఓ హరిసింగ్ నాయక్, తహశీల్దార్ సంఘమిత్ర, మెడికల్ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

## జనం మెచ్చిన జననేతకు జన్మదిన శుభాకాంక్షలు

**విశ్వంభర, రామన్నపేట :** జనం మెచ్చిన జననేత భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని మంగళవారం ఢిల్లీలోని తన క్యాంపు కార్యాలయంలో రామన్నపేట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాదె శోభారాణి క్రిష్ణ కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. చామల ఎన్.ఎస్.యూ.ఐ, యువజన కాంగ్రెస్ నుండి తన రాజకీయ ప్రస్థానం మొదలుకొని 2005 నుండి 2006 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా, 2017 నుంచి 2021 వరకు టీపీసీసీ అధికార ప్రతినిధిగా, 2021 లో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులై నిత్యం పార్టీ కోసం పని చేసి 2024లో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్ధిగా పోటీలో నిలబడి పత్యర్థులపై 2,22,170 ఓట్ల మెజారిటీ తో గెలుపొందిన చామల కిరణ్ కుమార్ రెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల మహిళా



కాంగ్రెస్ అధ్యక్షురాలు గాదె శోభారాణి క్రిష్ణ హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## బస్సులను పొడిగించాలని

# డిపో మేనేజర్‌కు వినతి పత్రం



**విశ్వంభర మేడ్చల్ జిల్లా/మేడిపల్లి :** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతి పత్ర అందచేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గోపు రాములు మాట్లాడుతూ 13వ డివిజన్లో కాలనీలు విస్తృతంగా పెరిగిపోయాయనీ, పలు కాలనీలలో జనావాసాలు అధికమయ్యాయని, ప్రజల యొక్క క్షేమాలను దృష్టిలో ఉంచుకొని వారికి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, బస్సులు అందుబాటులో ఉండే విధంగా కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరినీ డిపో మేనేజర్ నీ కలిసి డివిజన్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారనీ తెలిపారు. డివిజన్ ప్రజలకు, విద్యార్థులకు, వికలాంగులకు బస్సులు అందుబాటులో లేవని, దేవేందర్ నగర్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ ల వరకు 18 బి, 113, 115 నెంబర్ గల బస్సులను పొడిగించలాని మేనేజర్ కు విన్నపించుకొని వినతి పత్రం అందజేశారు. దానికి సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ తొందర్లోనే బస్సు రూట్ ను పరిశీలించి బస్ సర్వీసులను పొడిగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దేవేందర్ కాలనీ అధ్యక్షులు నల్ల నరసింహ, కొండ శ్రీనివాస్, మల్లెపాక శంకర్, మంచినీళ్ళ శ్రీనివాస్, మల్లెపాక శేఖర్, డివిజన్ ముఖ్యులు డిపో మేనేజర్ ని కలిసి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని విన్నపించారు.

## ఏఐటీయూసీ పోరాట ఫలితమే పెరిగిన వేతనాలు




**విశ్వంభర, దేవరకొండ :** దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కార్మికుల వేతనాలు పెరగడం ఏఐటీయూసీ కృషి ఫలితమేనని ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కార్మికుల వేతనాలను పెంచాలని ఆందోళన ఏఐటీయూసీ నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మంగళ వారం హాస్పిటల్స్ సూపరెంటెంట్ డాక్టర్ రాములు నాయక్, ఏజెన్సీ కాంట్రాక్టర్ తో జరిగిన చర్చలలో వేతనాలను పెంచుతామని ఒప్పుకోవడం జరిగింది. ప్రస్తుతం ఇస్తున్న 7,700 నుంచి 10,500 ఇచ్చే విధంగా ఒప్పందం కుది రిందని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం కాలంగా టెండర్ లో హాస్పిటల్లో బెడ్ల సంఖ్య పెరగక పోవటం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ చుట్టుముట్టు ప్రాంతాల్లో ప్రభుత్వాసు పత్రి లేకపోవడం వల్ల ఇక్కడికి పెద్ద సంఖ్యలో పేషెంట్లు వస్తున్నారని దీని 200 బేడ్లకు హాస్పిటల్స్ సామర్థ్యాన్ని పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు పీఎస్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని ప్రతినెల జీతాలు ఇవ్వాలని ఆయన కోరారు. కార్మికుల హక్కుల కోసం ఏఐటీయుసీ ఎప్పుడూ అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. కాంటాక్ట్ వ్యవస్థ రద్దుచేసి హాస్పిటల్ కార్మికులం దరినీ రెగ్యులర్ చేసేందుకు భవిష్యత్ లో పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి జూలూరు వెంకటరాములు, మండల కార్యదర్శి ఏ మల్లయ్య, హాస్పిటల్ యూనియన్ నాయకులు ప్రణయ్, బద్రమ్మ, రాణి తారమ్మ, శరదా, మంజుల, శైని, లింగమ్మ, అరుణ, సరిత, జ్యోతి, చందు, చంటి, శ్రీనివాస్, సుజాత, శ్రీలత, సరిత, సంజయ్, సైదమ్మ, పద్మ, జయమ్మ, సాజిదా పాల్గొన్నారు.



## దివ్యాంగులకు అండగా ఉందాం!!

**విశ్వంభర, కేశంపేట :** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలోని అర్హులైన సుమారుగా 400 దివ్యాంగులకు బస్సు పాసులను తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీ.హెచ్.పీ.ఎస్ కేశంపేట్ మండల ఇంచార్జ్ సూరమోని యాదయ్య, వీ.హెచ్.పీ.ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, వీ.హెచ్.పీ.ఎస్ మండల మహిళా ఇంచార్జ్ మమత, హైదరాబాద్ టీఎస్ఆర్టీసీ వన్ డిపో పీ.హెచ్.సీ బస్సు పాస్ ఇంచార్జ్ శ్రీరామ్, మాజీ సర్పంచ్ శివయ్య, నర్సింలు, యాదయ్య, బాబయ్య, సత్యం, లక్ష్మయ్య, టైలర్ యాదయ్య, శంకర్, రామచంద్రయ్య, రామచంద్ర, బిక్షపతి పాల్గొన్నారు.



## భూపాలపల్లి కలెక్టరేట్ ఏఓ ములుగుకు బదిలీ

**విశ్వంభర, భూపాలపల్లి :** కలెక్టరేట్ లో ఏఓ విధులు ఎంతో కీలకమని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహేష్ బాబు ఇటీవల ములుగు జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఏవో మహేష్ బాబుకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ లో పరిపాలన అధికారి పదవి చాలా కీలకమని అన్నారు. ఏఓ మహేష్ బాబు కలెక్టరేట్ తో పాటు అన్ని శాఖలను సమన్వయం చేశారని అన్నారు. ఏఓ మహేష్ బాబు దాదాపు 6 సంవత్సరాలు పాటు సుదీర్ఘంగా సేవలు అందించారని, అనుభవం కలిగిన అధికారి అని పేర్కొన్నారు. అందరితో కలిమిడిగా ఉంటూ సమన్వయంతో విధులు నిర్వహించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ సంఘ అధ్యక్షులు శామ్యూల్, వైస్ ప్రెసిడెంట్ అవినాష్, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, డీపీఆర్ఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఉద్యానవన అధికారి సంజీవరావు, డీఆర్డీఓ నరేష్, ఎస్సీ కార్పోరేషన్ ఈ డి వెంకటేశ్వర రావు, ఎల్డీఎం తిరుపతి, విద్యాశాఖ అధికారి రాజేందర్, డీటీఓ, పీఏఓ, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎంపీ చామల జన్మదిన వేడుకలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మంగళవారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మ దినోత్సవం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం



**విశ్వంభర, హయత్ నగర్ :** హయత్ నగర్ లో రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. బ్రాహ్మణోత్తరులచే భక్తులకు కనువిందు చేసే విధంగా నిర్వహించనైనది. మొక్కిన మొక్కులు తీర్చే తల్లిగా ప్రసిద్ధికెక్కిన దేవాలయం. ఏడు సంవత్సరాల నుండి అనేకమంది భక్తులకు మొక్కుకున్న మొక్కులు తీర్చిన దేవతగా, ప్రసిద్ధి చెందిన దేవాలయం. సంతానం లేని వారు మొక్కినచో సంతాన భాగ్యం ఎంతోమంది పొందినారని ఇక్కడి భక్తులు వివరించనైనది. ఇక్కడి భక్తుల సహకారంతో ప్రతి సంవత్సరం కళ్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిట్టల జంగం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి, జోరల నాగభూషణం, కోశాధికారి, చెన్నగౌని శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, దాసర మోది శ్రీధర్, ఉపాధ్యక్షులు కందాడి నరసింహ, దేశం ముత్యం శ్రీకాంత్, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## రైస్ మిల్లులను తనిఖీ చేసిన అధికారులు



**విశ్వంభర నారాయణఖేడ్ :** నియోజకవర్గ పరిధిలోని పేట మండల రైస్ మిల్లులను మంగళవారం రెవెన్యూ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని శివాయపల్లి ఉత్తులూరు తిరుమలాపూర్ శివారులో ఉన్న రైస్ మిల్లులను ప్రత్యేక బృందం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా గత ఖరీఫ్ రబీ సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను పరిశీలించారు. తనిఖీ చేసిన వారిలో రేగోడు తాసిల్దార్ బాల లక్ష్మి టేక్మాల్, తాసిల్దార్ కృష్ణ, పెద్ద శంకరంపేట తాసిల్దార్ గ్రేసీ బాయ్, పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శరణప్ప, సూపరిండెంట్ షకీల్ తోపాటు రైస్మిల్ యాజమాన్లు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు



**విశ్వంభర, నారాయణఖేడ్ :** ఆషాడ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేటలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారికి మంగళవారం అధిక సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు వీధులలో నుండి మహిళలు భాష భజన్త్రీలతో బోనం ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో తరలివచ్చారు ప్రియాంక కాలనీ వాసులతో పాటు పెద్ద శంకరంపేటలోని పట్టణ పురవీధుల గుండా భాజా భజంత్రీలతో శివసత్తుల నృత్యాలతో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుండి ఆలయంలో మహిళలు అమ్మవారిని దర్శించుకొని వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులందరికీ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు యువకులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ అధికారులకు వినతి



**విశ్వంభర, అంబర్‌పేట్ :** బోనాల పండుగను పురస్కరించుకొని ఈ నెల 28న ఉస్మానియా యూనివర్సిటీలోని మోహిని చెరువు కట్టపైన ఉన్న శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి గుడికి వచ్చే భక్తులకి యూనివర్సిటీలో ప్రవేశం కల్పించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ పద్మా వెంకట రెడ్డి, సీనియర్ బీ.ఆర్.ఎస్ నాయకులు బి.వెంకట రెడ్డి, మిరియాల శ్రీనివాస్, వెంకటరమణ రాజు, సతీష్ కలసి ఉస్మానియా యూనివర్సిటీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.



చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ళ మధుసూదన్ రెడ్డిని మంగళవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య గుప్తా, బీజేపీ రాష్ట్ర నాయకులు తుమ్మల మురళీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, దయ్యాల కుమారస్వామి, రాంరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.




# స్థానిక సంస్థలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

- ఆ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి..
- గ్రామాలు పటిష్టంగా ఉంటేనే రాష్ట్రం బలంగా ఉంటుంది..
- సక్రమంగా నిధులు వినియోగించుకోవాలి..
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**విశ్వంభర, కరీంనగర్ :** గ్రామాలు, పట్టణాల్లో ఆదాయాన్ని మరింత పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. ఆర్థికంగా బలోపేతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు-బాధ్యతలపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారుల నుంచి విధులు, బాధ్యతలు, ఆదాయం పెంచే మార్గాలపై సూచనలు సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా సానికల సంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్థానిక సంస్థల ఆర్థికంగా బలోపేతం అవుతేనే రాష్ట్రము, దేశము పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను పెంచుకుంటూ ప్రగతి పథంలో పయనించాలని తెలిపారు. గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు సక్రమంగా వినియోగం అవుతున్నాయా లేదో అని అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించాలని, దుర్వినియోగం కాకుండా చూడాలని తెలిపారు. పక్కాగా వాటిపై ఆడిట్ నిర్వహించాలని, అన్ని రంగాలతో పాటు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామాలు, జిల్లాలు బలంగా ఉంటేనే రాష్ట్రము, దేశం బలంగా ఉంటుందని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉంటుందని తెలిపారు. అధికారులు ఇచ్చిన సూచనలు సలహాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఒక మాడల్ రిపోర్ట్ తయారు చేసి ఇస్తామని చెప్పారు. ఆదాయం పెంపుపై కొత్త కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు.

### కరీంనగర్‌కు మంచి కలెక్టర్ దొరకడం అదృష్టం..

కరీంనగర్ జిల్లాకు అన్ని అంశాలపై అవగాహన ఉన్న మంచి కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. అధికారుల సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందని తెలిపారు. దేశ పునర్నిర్మాణంలో బ్యూరోకాట్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కలెక్టర్లే గవర్నమెంట్ అని, ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టమని తెలిపారు. స్థానిక సంస్థల బలోపేతంపై ప్రభుత్వానికి అత్యుత్తమైన రిపోర్ట్ అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఏం రమేష్, సంకే పెల్లి సుధీర్ రెడ్డి, మాలోతు నెహ్రూ నాయక్, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ చైర్మన్ మోర హనుమండ్లు, పెద్దపెల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీపీఓ రవీందర్, జెడ్పీ సీఈవో లు శ్రీనివాస్, గౌతమ్ రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని డీఆర్డీఓలు, సీఈవోలు డీపీఓలు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

### కొత్త కొత్త ప్రయోగాలు చేయాలి..

**రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ స్మితా సబర్వాల్**

గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు కొత్త కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ సెక్రటరీ స్మితా సబర్వాల్ సూచించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడం గొప్ప అనుభూతిని ఇస్తుందని, కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని తెలిపారు. మున్సిపాలిటీల్లో అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న వినూత్నమైన కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ఇక్కడ వాటి అమలు చేయాలని పేర్కొన్నారు. హోటల్లల్లో వేస్టేజ్ పై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆ వేస్టేజ్ను తగ్గించాలని సూచించారు. కొత్త కొత్త ప్రయోగాలతోనే మంచి ఫలితాలు లభిస్తాయని చెప్పారు. ఆ దిశగా అధికారులు ముందుకు సాగాలని సూచించారు. స్థానికంగానే ఆదాయం పెంచుకునే మార్గాలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు.

### మహిళల ఆర్థిక అభ్యున్నతికి చర్యలు..

**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**

గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధితోనే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు అప్పగించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారని కితాబు ఇచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు అద్భుతంగా పూర్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులు చేసే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తున్నామని వివరించారు. స్థానిక సంస్థల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని అంశాలను కులంకషంగా చర్చిస్తామని తెలిపారు.

## భారతదేశంలో థామస్ మోర్ యూనివర్సిటీ

### అంతర్జాతీయ విద్యార్థులకు ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రఖ్యాత ఉన్నత విద్యా సంస్థ థామస్ మోర్ యూనివర్సిటీ తొలిసారిగా భారతదేశానికి వస్తోంది. ఇక్కడున్న విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్య అవకాశాల కోసం, ఇంకా విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు అందిం చడానికి ఈ యూనివర్సిటీ ఎంతో ఉత్సాహంగా ఉంది. అంతర్జాతీయంగా అన్ని దేశాలకూ విస్తరించాలని, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించాలని పెట్టుకున్న తమ లక్ష్యాల సాధనలో భారతదేశ సందర్శన ఒక ముఖ్యమైన మైలురాయి అవుతుంది. థామస్ మోర్ యూనివర్సిటీ ప్రపంచవ్యాప్తంగా విద్యావకాశాలను అందించేందుకు, పెంపొందించడానికి స్మార్ట్ అడ్వెంచర్స్, గెట్2 యుని.కామ్ తో ప్రత్యేకంగా భాగస్వామ్యం కుదుర్చుకుంది. అంతర్జాతీయ విద్యార్థులకు అవకాశాలు, విద్యాపరమైన ఎక్స్ఛేంజిలు, పరిశోధన సహకారం, రెండు దేశాల విద్యార్థులు, అధ్యాపకులకు ప్రయోజనం చేకూర్చే ఉమ్మడి కార్యక్రమాలను సులభతరం చేయడమే ఈ భాగస్వామ్యాల లక్ష్యం. ఈ సందర్భంగా స్మార్ట్ అడ్వంచర్స్ ప్రెసిడెంట్ పవన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, "భారతదేశానికి ఈ అవకాశం తీసుకొచ్చి థామస్ మోర్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. వాళ్ల ఈ పర్యటన భారతీయ విద్యార్థులకు విభిన్న, సంపూర్ణ మార్పును అందించే విద్యానుభావాలను అందించాలన్న మా నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ఇంకా భారతదేశం, ఇతర దేశాల విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాలకు తలుపులు తెరుస్తుంది" అని చెప్పారు. థామస్ మోర్ యూనివర్సిటీ వివిధ విభాగాలలో అసాధారణమైన అకడమిక్ ఆఫర్లు, ప్రత్యేక కోర్సులకు ప్రసిద్ధి చెందింది. ఇందులో భాగంగా జూలై 24న హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్లో, 25న విజయవాడలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక అవకాశం విద్యార్థులు యూనివర్సిటీ ప్రతినిధులతో నేరుగా మాట్లాడేందుకు, అందుబాటులో ఉన్న వివిధ రకాల కోర్సుల గురించి అన్వేషించడానికి వీలు కల్పిస్తుంది. ఈ విశ్వవిద్యాలయం స్టెమ్, డేటా అనలిటిక్స్, ఫైనాన్స్, హెల్త్ కేర్ రంగాల్లో ప్రొఫెషనల్ ఎంబీఏ కోర్సులతో పాటు అనేక రకాల కోర్సులను అందిస్తుంది. ఇంకా పబ్లిక్ హెల్త్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో మాస్టర్స్ కోర్సులను అందిస్తున్నారు. అలాగే డేటా సైన్స్‌లో ప్రత్యేకతతో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందిస్తారు. అర్హులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి, థామస్ మోర్ యూనివర్సిటీ తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తోంది. అకడమిక్ ఎక్సలెన్స్, నాయకత్వ సామర్థ్యం, ఆయా రంగాల్లో సానుకూల ప్రభావం చూపాలనే నిబద్ధతను గుర్తించడం ఈ స్కాలర్ షిప్‌ల లక్ష్యం. విద్యార్థులు రాణించడానికి, వారి లక్ష్యాలను సాధించడానికి సమాన అవకాశాలను అందించాలని యూనివర్సిటీ విశ్వసిస్తుంది. ఈ సందర్భంగా థామస్ మోర్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ జోసెఫ్ చిల్లో మాట్లాడుతూ, "ఈ చారిత్రాత్మక భారత పర్యటనను ప్రారంభించడం, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలతో అర్థవంతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ పర్యటన విద్యార్థులకు సమూల మార్పులతో కూడిన విద్యానుభవాన్ని అందించడం, అంతర్జాతీయంగా నిమగ్నం అయ్యేలా చూడాలన్న మా నిబద్ధతకు నిదర్శనం" అని తెలిపారు. విద్యార్థులు, విద్యా సంస్థలు, విద్యా నిపుణులు అందరూ స్పాట్ అడ్మిషన్ల కోసం నిర్దేశించిన ప్రాంతాలకు సమయానికి చేరుకోవాలని థామస్ మోర్ యూనివర్సిటీ ఆహ్వానిస్తోంది. అక్కడకు వచ్చి, వ్యక్తిగత వృద్ధితో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకోవాలని కోరుతోంది.

## విద్యుత్ ఘాతానికి గురై ఆవు మృతి

**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో ఆవు కరెంటు షాక్ తో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాడి రైతు గుద్దటి బాలయ్య ఆవు పొలంలో మేత మేస్తున్న సమయంలో ట్రాన్స్ఫారానికి తాకడం వల్ల చనిపోవడం జరిగింది అని తెలిపాడు. ఆవు ఖరీదు సుమారు ఒక్క లక్షా ఇరవై వేల రూపాయలు ఉంటుందని దాని పాలతోటే కుటుంబ పోషణ చేస్తున్నానని తెలిపారు. అది మరణించడతో దిక్కుతోచడం లేదని ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా పాడి రైతు బాలయ్య కోరుతున్నారు.



### చిరుత దాడి రెండు గేదెలు మృతి

**విశ్వంభర, డిండి :** డిండి మండలం కేంద్రంలో చిరుత కలకలం రేపింది. రెండు గేదె దూడలపై చిరుత దాడి చేసి చంపిందని డిండి మండలంలో కొత్త తండాకు చెందిన రైతు మోతిలాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మోతిలాల్ పొలం తండాకు ఆనుకొని ఉండడంతో చిరుత మళ్లీ వస్తుందోమో అని తండావాసులు భయాందోళనలకు గురవుతూ ఆటవి అధికారులను తక్షణమే చర్య తీసుకుని చిరుతను పట్టుకోవాలని కొత్త తండా గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రతిపక్ష నేత హోదా ఇప్పించండి

### హైకోర్టులో జగన్ పిటిషన్



**విశ్వంభర, అమరావతి :** వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఏపీ అసెంబ్లీలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని స్పీకర్ ను ఆదేశించాలని మంగళవారం నాడు హైకోర్టులో జగన్ పిటిషన్ దాఖలు చేశారు. సభలో ప్రతిపక్షంలో ఎవరు ఎక్కువ సభ్యులు ఉంటే వారికి ప్రతిపక్ష హోదా ఉంటుందని అన్నారు. ఆ పార్టీ నేతకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలన్నారు. ఏపీ శాసనసభలో పార్లమెంటరీ సాంప్రదాయాలను పాటించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు ప్రతిపక్ష నేతగా హోదా ఇవ్వాలని లేఖ రాసినా ఇవ్వలేదని పిటిషన్‌లో తెలిపారు. వెంటనే తనకు ప్రతిపక్ష నేతగా హోదా ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో జగన్ కోరారు. కాగా.. ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ పార్టీ ఘోర పరాజయం పాలైంది. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జగన్ ఈసారి ఎన్నికల్లో మాత్రం ఓటమిని చవిచూశారు. కేవలం 11 సీట్లు మాత్రమే గెలిచి ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయారు. సాధారణంగా ప్రతిపక్ష హోదాకు 18 మంది ఎమ్మెల్యేలు గెలుపొందాల్సి ఉంటుంది. కానీ వైసీపీ కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితమైంది. దీంతో ప్రతిపక్ష హోదా కూడా జగన్ దక్కకుండాపోయింది. అయితే తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ స్పీకర్ అయ్యన్న పాత్రుడికి జగన్ లేఖ రాశారు. ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు వైసీపీకి ప్రతిపక్ష హోదా ఉండాలని.. ఈ విషయంలో మరోసారి ఆలోచించాలని అన్నారు. ప్రతిపక్ష హోదాకు 10శాతం సీట్లు కావాలని ఎక్కడా లేదని జగన్ లేఖలో పేర్కొన్నారు.

### ఏలూరు కాల్వలో లభ్యమైన నర్సాపురం

# ఎంపీడీవో వెంకటరమణ మృతదేహం

- **ఈ నెల 15న అదృశ్యమైన వెంకటరమణారావు**
- **వారం రోజులుగా గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

**విశ్వంభర, ఏలూరు :** పుట్టిన రోజే చనిపోయే రోజంటూ మెసేజ్ పెట్టి ఇంట్లోంచి వెళ్లిపోయిన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటేశ్వరరావు కథ విషాదాంతమైంది. తాజాగా ఆయన మృతదేహం ఏలూరు కాల్వలో లభ్యమైంది. వారం రోజులుగా గాలింపు జరుపుతున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు మధురానగర్ పైవంతెన పిల్లర్‌కు చిక్కుకున్న మృతదేహం కనిపించింది. ఆయన దూకిన ప్రదేశానికి సరిగ్గా కిలోమీటర్ దూరంలో మృతదేహాన్ని గుర్తించారు. విజయవాడ సమీపంలోని కానూరు మహదేవపురంలో ఉండే వెంకటరమణారావు నరసాపురంలో ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు సెలవు పెట్టిన ఆయన కానూరు వచ్చారు. 15న పని ఉందని, మచిలీపట్టణం వెళ్లారు. అర్ధరాత్రి తాను చనిపోతున్నానని, అందరూ జాగ్రత్త అని మెసేజ్ పెట్టి సెల్ ఆఫ్ చేశారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు మచిలీపట్టణం, విజయవాడలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన వాహనం మచిలీపట్టణం రైల్వే స్టేషన్‌లో ఉన్నట్టు గుర్తించారు. మాధవాయిపాలెం ఫెర్రీ రేవు పాటదారు రూ. 54 లక్షల బకాయిలు ఉండడమే కారణమని గుర్తించారు.

# బాబాయ్‌ని ఎవరు చంపారో త్వరలో తెలుస్తుంది

### ఏపీ సీఎం చంద్రబాబు సంచలన వాక్యలు



**విశ్వంభర, అమరావతి :** బాబాయ్‌ని ఎవరు చంపారో త్వరలో తెలుస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇవాళ అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడుతూ.. నేరస్తుడే సీఎం పదవిని చేపడితే, పోలీసులు నేరస్తులకు సహకరిస్తే ఎలా ఉంటుందో గత ఐదేళ్లల్లో చూశామని చెప్పారు. అవినాశ్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి వెళ్లిన సీబీఐ ఖాళీ చేతులతో తిరిగి వచ్చిందని అన్నారు. మొదట కోడికత్తి, ఆ తర్వాత గులకరాయి డ్రామాలు ఆడారని తెలిపారు. అయితే, కోడికత్తి డ్రామా మాత్రమే ఫలించిందని, గులకరాయి నాటకం పండలేదని ఎద్దేవా చేశారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించారని తెలిపారు. రుషికొండ ప్యాలెసును ఏం చేయాలో కూడా అర్థం కావడం లేదని చెప్పారు. ఎమ్మెల్యేలంతా ఓసారి రుషికొండ ప్యాలెస్ సందర్శించాల్సి ఉంటుందని తెలిపారు. బాత్రూంలు కూడా లక్షలు వెచ్చించి నిర్మించారని చెప్పారు. కొందరు టూరిజానికి ఇమ్మంటున్నారని, ఏం చేయాలో ఆలోచిస్తామని తెలిపారు. ఏపీలోని మద్యం కుంభకోణం ముందు ఢిల్లీ లిక్కర్ స్కాం నథింగ్ అని ఆరోపించారు. త్వరలోనే మద్యం కుంభకోణం విషయాన్నీ మాట్లాడతానని చెప్పారు.

### ఐదేళ్ల పాటు విధ్వంసకర పాలన చూశాం

**విష్ణుకుమార్ రాజు**

బాబాయ్‌ని ఎవరు చంపారన్న అంశంపై చంద్రబాబు స్పీచ్ మధ్యలో విష్ణుకుమార్ రాజు కల్పించుకుని మధ్యలో మాట్లాడారు. ఐదేళ్ల పాటు విధ్వంసకర పాలన చూశామని తెలిపారు. ఇంతటి విధ్వంసకర పాలన చూసిన తర్వాత కూడా 40 శాతం ఓట్లెలా వచ్చాయోనని అన్నారు. వివేకా హత్య విషయంలో సీబీఐ విచారణలో వాస్తవాలు తెలుతాయని విష్ణు కుమార్ రాజు అన్నారు. కేంద్రమే తేల్చాలని టీడీపీ సభ్యులు చెప్పారు.

### ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు

# ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం



**విశ్వంభర, అమరావతి :** తాము అధికారంలోకి వస్తే వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తామని కూటమి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నుంచి అనుమతి తీసుకున్న అనంతరం... రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒక్క ఇంగ్లీషు పదం కూడా లేకుండా సభా వ్యవహారాలు నడిపించడం విశేషం. దాంతో ఆయనను సభ్యులందరూ అభినందించారు. "మంత్రి గారి ప్రతిపాదన సభా సమక్షంలో ఉంది. ఇప్పుడు విషయం ఏమిటంటే... ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం రద్దు బిల్లు-2024ను ప్రవేశపెట్టారు. ఈ ప్రతిపాదన పట్ల సభలో సుముఖంగా ఉన్నవారు అవును అనండి... వ్యతిరేకంగా ఉన్నవారు కాదు అనండి" అంటూ అయ్యన్నపాత్రుడు పూర్తిగా తెలుగులో మాట్లాడారు. అందరూ అవును అన్నారు కాబట్టి ఈ ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించడమైనది అంటూ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రకటించారు. దీనిపై శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ పైకి లేచి... మొట్టమొదటి సారిగా అసెంబ్లీలో తెలుగులో మాట్లాడి బిల్లును ప్రవేశపెట్టడం హర్షణీయం అని అయ్యన్నపాత్రుడిని అభినందించారు. పైగా, మా అందరికీ ఇష్టమైన బిల్లును తెలుగులో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు సార్ అంటూ చమత్కరించారు. ఈ రోజు నుంచి మీరొక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు... మీకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అంటూ పయ్యావుల పేర్కొన్నారు.






# ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ చరిత్ర

**విశ్వంభర, స్పోర్ట్స్** : ఒలింపిక్స్‌లో అత్యంత ఆసక్తికరమైన క్రీడల్లో ఒకటిగా వెయిట్ లిఫ్టింగ్ ఫేమస్ అయ్యింది. అయితే ఈ క్రీడా చాలా ప్రమాదకరం. ఒక చిన్న తప్పు చేస్తే చాలు, అథ్లెట్ భారీ ప్రమాదం ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంతకీ ఈ క్రీడ ఎలా మొదలైంది? ఒలింపిక్స్‌లో భారత వెయిట్ లిఫ్టర్ల ప్రస్థానం ఎలా సాగిందో ఇప్పుడు చూద్దాం. ఈ చారిత్రాత్మక క్రీడ మూలాలు ఆఫ్రికా, దక్షిణ ఆసియా, ఆధునిక గ్రీస్‌లో ఉన్నాయి. ఇంటర్నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ (IWF) అనే గవర్నింగ్ బాడీ 1905లో ఏర్పడగా, దీని ద్వారా ఈ క్రీడా ప్రాచుర్యం పొందింది. అంతేకాకుండా ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌కి శాశ్వత స్థానం కల్పించడంలోనూ ఇది కీలక పాత్ర పోషించింది.



**ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ చరిత్ర**

వెయిట్‌లిఫ్టింగ్ 1896లో తొలిసారి ప్రవేశపెట్టారు. అయితే ఈ క్రీడలో అప్పటికి, ఇప్పటికీ చాలా తేడాలు వచ్చాయి. 1896 ఒలింపిక్స్‌లో రెండు ఈవెంట్స్, అంటే ఒక చేత్తో ఎత్తడం, రెండు చేతులతో ఎత్తడం నిర్వహించారు. గ్రేట్ బ్రిటన్‌కు చెందిన లాన్సెస్టన్ ఇలియట్ వన్ హ్యాండ్ ఛాంపియన్‌గా నిలవగా, డెన్మార్క్‌కు చెందిన విగ్గో జెన్సన్ టూ హ్యాండ్స్ కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత 1920 వరకు ఈ క్రీడ కనిపించలేదు. ఆ తర్వాత నుంచి ఇది ఓ సాధారణ ఈవెంట్‌గా మారింది. 1924 ఒలింపిక్స్ తర్వాత వన్ హ్యాండ్ ఈవెంట్‌ను తొలగించారు. 1928 ఒలింపిక్స్ సమయానాకి, లిఫ్టులు స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, క్లీన్ అండ్ ప్రెస్ వంటి మూడుదశల ప్రక్రియగా మారాయి.

1972లో వెయిట్‌లిఫ్టర్‌ల టెక్నిక్‌ని అంచనా వేయడంలో ఇబ్బందులు ఉండటం వల్ల క్లీన్ అండ్ ప్రెస్ ప్రక్రియను తొలగించారు. 2000 సిడ్నీ ఒలింపిక్స్ నుంచి మహిళల వెయిట్ లిఫ్టింగ్ ప్రారంభమైంది.

**ఒలింపిక్ వెయిట్‌లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన**

**పైరోస్ డిమాస్ (గ్రీస్)** : 1992 నుంచి 2004 వరకు 82.5/83/85 కిలోల విభాగాల్లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్యం గెలిచాడు. అకాకియోస్ కకియాస్విలిస్ (గ్రీస్), హలీల్ ముట్లు (టర్కీ), నయీమ్ సులేమనోగ్లు (టర్కీ) ఒక్కొక్కరు ఒక్కో స్వర్ణం సాధించారు. చెన్ యాంకింగ్ (చైనా), హ్సు షుచింగ్ (దక్షిణ కొరియా) 58 కేజీలు, 53 కేజీల విభాగాల్లో వరుసగా రెండు స్వర్ణాలు సాధించారు.

**ఒలింపిక్ వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ ట్రాక్ రికార్డు**

**1948 :** తొలిసారిగా భారత్ తరపున డేనియల్ పాన్ మోనీ పురుషుల ఫెదర్‌వెయిట్‌లో పాల్గొన్నాడు. ఫైనల్లో 280 కిలోలు ఎత్తి, 16వ స్థానంలో నిలిచాడు. దండమూడి రాజగోపాల్ పురుషుల లైట్ వెయిట్‌లో పాల్గొన్నప్పటికీ చివరి స్థానంలో నిలిచాడు.

**1984 :** మహేంద్రన్ కన్నన్(ఫ్లైవెయిట్ ), దేవేన్ గోవిందసామి(బాంటమ్ వెయిట్) ఫైనల్లో టాప్ టెన్‌లో నిలిచారు.

**2000 :** మహిళల 69 కిలోల విభాగంలో కరణం మల్లీశ్వరి భారతదేశానికి మొదటి వెయిట్ లిఫ్టింగ్ పతకాన్ని (కాంస్యం) అందించింది.

**2004 :** మహిళల 48 కిలోల విభాగంలో కుంజరాణి దేవి తృటిలో పతకాన్ని కోల్పోయింది. నాలుగో స్థానంలో నిలిచింది.

2021: మీరాబాయి చాను టోక్యోలో మొత్తం 202 కిలోలు ఎత్తి రజత పతకాన్ని గెలుచుకుంది.

**వెయిట్ లిఫ్టింగ్ నియమాలు**

వెయిట్ లిఫ్టింగ్ రెండు ప్రధాన లిఫ్ట్‌లను కలిగి ఉంటుంది : స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్.

**స్నాచ్ :** లిఫ్టర్ బార్‌బెల్‌ను లిఫ్ట్ చేసి, ఒకే స్మూత్ మోషన్‌లో తల పైకి ఎత్తాలి.

**క్లీన్ అండ్ జెర్క్ :** లిఫ్టర్ మొదట బార్‌బెల్‌ను తమ ఛాతీ (క్లీన్) పై వరకు లిఫ్ట్ చేస్తాడు. తర్వాత దాన్ని తలపైకి (జెర్క్) లేపుతాడు.

వెయిట్‌లిఫ్టింగ్‌కు ప్రతి విభాగంలో మూడు అవకాశాలు ఉంటాయి. రెండింటిలో సాధించిన స్కోర్‌ని అథ్లెట్ టోటల్ స్కోర్‌గా లెక్కిస్తారు. ముందుగా అత్యల్ప బరువును ఎత్తాలని నిర్ణయించుకున్న అథ్లెట్ ఛాన్స్ తీసుకోవాలి. వెయిట్‌లిఫ్టర్‌లు తమ పేరును పిలిచిన ఒక నిమిషంలోగా వచ్చి అటెంప్ట్ చేయాల్సి ఉంటుంది.

**పారిస్ 2024లో భారతీయ వెయిట్ లిఫ్టర్లు**

**మీరాబాయి చాను (49 కేజీలు):** మీరాబాయి చాను తన మూడో ఒలింపిక్స్‌లో పాల్గొంటోంది. టోక్యో 2021 ఒలింపిక్స్‌లో 48 కిలోల విభాగంలో రజత పతకాన్ని గెలుచుకుంది. ఒలింపిక్ పతకాన్ని గెలుచుకున్న రెండో భారతీయ వెయిట్‌లిఫ్టర్‌గా నిలిచింది. ఇటీవలే గాయం నుంచి కోలుకుంది. భారత్‌కి పతకం అందిస్తుందని భారీ అంచనాలు ఉన్నాయి. పారిస్ క్వాలిఫికేషన్ ఈవెంట్‌లో 12వ స్థానంలో నిలిచింది.




# భారత్, పాక్ టీ20 సిరీస్‌పై పీసీబీ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లకు ఉండే క్రేజే వేరు. అయితే.. కొన్ని కారణాల వల్ల 2012 తరువాత ఇరు దేశాల మధ్య ఎలాంటి ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. కేవలం ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఈ క్రమంలో తటస్థ వేదికలపై భారత్‌తో సిరీస్‌లు నిర్వహించే అవకాశాలపై బీసీసీఐ అధికారులతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహసిన్ నఖ్వీ చర్చలు జరిపినట్లుగా వార్తలు వస్తున్నాయి. వీటిపై పీసీబీ స్పందించింది. అందులో ఎంత మాత్రం నిజం లేదదంది. పాకిస్తాన్ వెలుపల టీమ్ఇండియాతో టీ20 సిరీస్ ఆడేందుకు ఎలాంటి ప్రతిపాదనను తాము చేయలేదని పీసీబీ తెలిపింది. ప్రస్తుతం తమ దృష్టి అంతా ఛాంపియన్స్ ట్రోఫీ పైనే ఉందని చెప్పింది. ఈ టోర్నీని సజావుగా నిర్వహించడంపైనే ఉందంది. పాక్ జట్టుకు తీరిక లేని అంతర్జాతీయ మ్యాచుల షెడ్యూల్ కూడా ఉంది. అందుకనే భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల గురించి ఆలోచించడం లేదంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జరగనుంది. ఈ టోర్నీలో 8 దేశాలు పాల్గొననున్నాయి. కాగా.. ఈ టోర్నీకి సంబంధించిన డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను ఇప్పటికే ఐసీసీకి పీసీబీ అందజేసింది. అయితే.. ఈ టోర్నీలో టీమ్ఇండియా పాల్గొంటుందా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తేనే భారత జట్టు పాకిస్తాన్‌కు వెళ్లనుంది. ఇటీవల కొలంబో వేదికగా జరిగిన ఐసీసీ సమావేశంలో దీనిపై చర్చ జరుగుతాదని ఎంతో మంది భావించారు. కానీ.. దీనిపై ఎలాంటి చర్చ జరగలేదని ఈ సమావేశంలో పాల్గొన్న ఓ బీసీసీఐ అధికారి వెల్లడించారు.







Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com


జై తెలంగాణ
జై జై తెలంగాణ
JULY 24TH
BIRTHDAY
BHARAT RASHTRA SAMITHI
BRS
భారత రాష్ట్ర సమితి
DYNAMIC
LEADER
తారక రామారావు
తెలంగాణ ఉద్యమ యోధుడు...
బంగారు తెలంగాణ సాధకుడు...
నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిమానపాత్రుడు
మన యువ నాయకుడు
శ్రీ కల్వకుంట్ల తారక రామారావు గారికి
హృదయపూర్వక జన్మదిన
శుభాకాంక్షలు
డా॥ కిరణ్ కొమ్రేవార్
బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు
ముథోల్ నియోజకవర్గం, నిర్మల్ జిల్లా